20.09.2026
ఆదివారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 81
పేజీలు : 08 | వెల: రూ.5



# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

## రాష్ట్రానికి వచ్చిన పవన్



### కేరళంలో చికిత్స ముగించుకుని రిటర్న్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేరళలో చికిత్స ముగించుకుని ఏపీకి చేరుకున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం అంతర్జాతీయ వినాశ్రయంలో ఆయనకు నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం పవన్ కల్యాణ్ అక్కడి నుంచి నేరుగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు.

## పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థిక ప్రగతి

- ప్రపంచానికి భారత్ ఆదర్శం
- ప్రధాని నరేంద్ర మోడీ కామెంట్
- పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర
- విద్యుత్ రంగంలో ప్రగతిని ప్రత్యేకం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆర్థికంగా ఎలా ఎదగాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. "ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మన దేశంలో పునరుత్పాదక ఇంధనం, పరిశుభ్రమైన రవాణా వ్యవస్థలు, నీటి సంరక్షణ ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటే ఆర్థిక పురోగతి కూడా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రకృతితో మమేకమై జీవించడం భారత్‌కు శతాబ్దాల నుంచి వస్తున్న ఆచారం అని మోడీ గుర్తుచేశారు. తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన భారత్, ఆ సాంప్రదాయ అనుభవాలు, సిద్ధాంతాల పునాదిగానే నేటి ఆధునిక వాతావరణ సమస్యలకు పరిష్కారాలు చూపుతోందన్నారు. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

2లో..

# వికసిత్ భారత్ సదస్సులో తెలంగాణ విజన్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- కేంద్రం, రాష్ట్రాల భాగస్వామ్యంతోనే అభివృద్ధి
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌తో భవిష్యత్ ప్రణాళిక
- వికసిత్ భారత్' అంటే యూనియన్ ఆఫ్ స్టేట్స్ భాగస్వామ్యమే



**హైదరాబాద్, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

దేశ రాజధాని న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్' ఆర్థిక సదస్సు ఘనంగా నిర్వహించబడింది. 2047 నాటికి భారతదేశం సాధించాల్సిన సమగ్ర ఆర్థిక వృద్ధి, ఆ దిశగా వివిధ రాష్ట్రాలు పోషించాల్సిన పాత్ర , అనుసరించాల్సిన ప్రణాళికలపై ఈ సమీక్షా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై, రాష్ట్ర ప్రభుత్వ విజన్ , ఆర్థిక లక్ష్యాలను స్పష్టంగా వివరించారు.

### 2047 నాటికి $3 ట్రిలియన్ల ఎకానమీ సాధనే తెలంగాణ ధ్యేయం




ఈ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వ ప్రణాళికలను సభ దృష్టికి తీసుకెళ్లారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే 2025 డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించిందని, దానికి అవసరమైన సమగ్ర ప్రణాళికలు , విధానాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు.

### వికసిత్ భారత్' అంటే యూనియన్ ఆఫ్ స్టేట్స్ భాగస్వామ్యమే




వికసిత్ భారత్ భావనపై మాట్లాడిన భట్టి విక్రమార్క, ఇది కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే పరిమితమైన అంశం కాదని స్పష్టం చేశారు. భారతదేశం అంటే భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని, ప్రతి రాష్ట్ర అభివృద్ధి ఇందులో భాగమేనని గుర్తుచేశారు. కేంద్రం , అన్ని రాష్ట్రాల సమగ్ర సహకారం, సమిష్టి భాగస్వామ్యంతోనే దేశం అనుకున్న ఆర్థిక లక్ష్యాలను వేగంగా సాధించగలదని ఆయన ఉద్ఘాటించారు.

## రేవంత్– కేటీఆర్ మైత్రి ఏంటో ప్రజలకు తెలుసు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- కేటీఆర్ బాధపడకుండా ఉండేలా..
- సర్వే నంబర్లతో సహా చెప్పారని విమర్శలు



6లో..

## సీపీఐతో చర్చలు సానుకూలం

- ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలతోనూ చర్చలు
- ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకుంటాం
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



2లో..

## మంగళగిరిలో అట్టహాసంగా డబ్ల్యూఏపీఎల్ ప్రారంభం

### హాజరైన నారా బ్రాహ్మణి, మిథాలి రాజ్



2లో..

## నిజంగానే పాలమూరు రైతులను తొక్కుతున్నడు



2లో..

- రేవంత్ ఆ డైలాగ్ దించేశాడు
- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం
- రైతులు రోడ్డెక్కుతున్న రంటే సిగ్గు లేదా..?
- సొంత గ్రామంలో పరిస్థితి దారుణంగా ఉంది

**హైదరాబాద్, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

నీ సొంతూరు కొండారెడ్డి పల్లి రైతులు శ్రీశైలం హైవే ఎక్కి కరెంట్ రావడం లేదని ధర్నా చేస్తున్నరు.. కనబడుతలేదా..? రేవంత్ నీకు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఆయన శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి తిరుగు ప్రయాణంలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు చేరుకున్నారు.

## చరిత్ర సృష్టించిన కండక్టర్ కుమారుడు

- ఢిల్లీ యూనివర్సిటీ
- విద్యార్థి సంఘం ఎన్నికలు
- దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్నాయి
- బీజేపీ, కాంగ్రెస్ సహా అన్ని రాజకీయ పార్టీలు
- విద్యార్థి విభాగాల మధ్య హోరాహోరీ పోరు


2లో..



## హోం మంత్రి అమిత్ షాకు అస్వస్థత

కర్ణాటక పర్యటనలో ఘటన రెండు రోజుల పర్యటనలో భాగంగా హుబ్బళ్లికి 1,200 పడకల మెడికల్ కాలేజీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి హాయన హాజరు కావాల్సి ఉంది

2లో..



## 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

- చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- నూతన పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనలో చేతివాటానికి తావివ్వొద్దు
- చేనేతల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు
- అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం.. ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వొద్దు

5లో..

**అమరావతి సెప్టెంబర్ 19, అనంత జనశక్తి ప్రతినిధి**

50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేయడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎటువంటి అక్రమాలు, అవినీతి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందజేసేలా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో నేతన్నల దరఖాస్తుల పరిశీలనలో జరుగుతున్న చేతివాటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న లక్ష్యాన్ని నీరు గార్చుతున్న అధికారులపై కొరడా ఝుళిపించారు.

### విశాఖ తాగు, పారిశ్రామిక నీటి అవసరాలపై

## సీఎం సమగ్ర సమీక్ష

- సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో విశాఖకు తాగునీటి కొరత రాకుండా సమగ్ర ప్రణాళిక.
- ఏలేరు కెనాల్ సామర్థ్యాన్ని 350 క్యూసెక్కులకు పెంచాలని సిఎం ఆదేశించారు.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

5లో..



**విశాఖపట్నం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నం నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత రాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర ప్రణాళిక రూపొందించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# నిజంగానే పాలమూరు రైతులను తొక్కుతున్నడు

(మొదటి పేజీ తరువాయి)



రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సొంత గ్రామ రైతులు రోడ్డెక్కుతున్నరంటే సిగ్గు లేదా..? ఆ డిప్యూటీ సీఎం ఉన్నడు.. ఎల్‌నినోతోని కరెంట్ వస్తలేదని ఆయన అంటడు. ఎల్‌నినోతో కరెంట్ కాదు.. ఎల్‌నినోతో నీళ్లు కాదు.. దేవుడు నీళ్లిచ్చిండు.. బొగ్గు ఇచ్చిండు.. దేవుడు బ్రహ్మాండంగా అన్ని ఇచ్చిండు. దేవుడు మన కేసీఆర్‌ను కూడా ఇచ్చిండు. కేసీఆర్ కరెంట్ తెచ్చి సబ్‌స్టేషన్లు కట్టిండు. బ్రహ్మాండంగా కరెంట్ ఇచ్చిండు. కానీ దురదృష్టమేంటంటే దేవుడు అన్ని ఇచ్చినా మరి పూజారి కరుణించలేదన్నట్టు ముఖ్యమంత్రిగా కూర్చున్నోడికి తెలివిలేక, కరెంట్ ఇచ్చే తెలివి లేక ఇయ్యాళ్ల రైతులను అవస్తలు పెడుతున్నడని ఫైర్ అయ్యారు. యూరియా ఇచ్చే తెలివిలేదు.. రైతు బంధు ఇచ్చే తెలివిలేదు.. రుణమాఫీ ఇచ్చే తెలివిలేదు.. బోనస్ ఇచ్చే తెలివి లేదు.. ఆఖరికి నీళ్లు ఇచ్చే తెలివి కూడా లేదన్నారు.

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును 90% పూర్తి చేసి కేసీఆర్ మీకు అప్పజెప్పి పోయారు. ఏనుగు వెళ్లింది తోక చిక్కిందన్నట్టు 10 శాతం పని మిగిలి ఉంది. ఓ 45 మీటర్ల కాలువ తవ్వితే అక్కడి దాకా కొడంగల్ దాకా నీళ్లు పోతయ్. కానీ ముఖ్యమంత్రికి ఇష్టం లేదు.. జల్దీజల్దీ చేస్తే కేసీఆర్‌కు పేరొస్తది కదా..అది రానియ్యా అని రేవంత్ ఫిక్సయ్యాడని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ నార్లాపూర్ దగ్గర ఒక పంప్ ఆన్ చేసి పోయిండు. మరి కేసీఆర్ చేసిన పనే అని రైతులకు తెలుస్తది..తప్ప నాకు పేరు రాదు అని చెప్పి.. రేవంత్ రెడ్డి ఎప్పుడూ తొక్కుకుంటూ వచ్చిన.. పండబెట్టిన అని డైలాగ్ చెబుతుంటడు. నిజంగానే ఇయ్యాళ్ల పాలమూరు వ్యవసాయాన్ని పండబెట్టిండు. పాలమూరు రైతులను తొక్కుతున్నడు. నీళ్లు ఇయ్యకుండా మీ బతుకులు ఆగం చేస్తా ఉన్నడని మండిపడ్డారు.

సబ్‌స్టేషన్ తనిఖీలో కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించి తిరుగు ప్రయాణంలో వనపర్తి జిల్లా పెబ్బేరుకు చేరుకున్నారు. రైతులు సాగు నీరు, కరెంట్ కోతలతో సతమతమవుతున్న నేపథ్యంలో పెబ్బే రు మండలం గుమ్మడం క్రాస్ రోడ్డు వద్ద రైతులతో మాట్లాడారు. గుమ్మడం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కేటీఆర్ సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ కోతల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు.

రోజుకు 5 గంటలే కరెంట్ వస్తుంది సార్.. మాకు కెనాల్ కూడా బంద్ అయింది.. సబ్ స్టేషన్ సిబ్బంది 12 గంటలు కరెంట్ ఇస్తున్నమంటే.. ఇస్తున్నవా.. బయటకు రైతులను అడుగుదామా..? ఒకసారి అని కేటీఆర్ ప్రశ్నించారు. కరెంట్ గురించి అడిగితే పైననే పోయింది.. మాకేం తెల్వదని అధికారులు చెబుతున్నారు.. మా చేన్లు అయితే ఎండిపోతున్నయ్.. ఒకటే మడి పారుతుంది సార్ అంటూ రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 శాతం పనులు చేసిపోతే 10 శాతం పడావు పెట్టి పాలమూరు రైతులను తొక్కుతున్నవ్.. పాలమూరు రైతుల వ్యవసాయాన్ని నాశనం చేస్తా ఉన్నవ్ రేవంత్ రెడ్డి.. వాళ్లు మిమ్మల్ని తరుమక ముందే మన కేసీఆర్ హయాంలో ఎలా కరెంట్ వచ్చేదో.. వెంటనే అలా సరిదిద్దాలని ప్రభుత్వానికి, అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు.



# పర్యావరణ పరిరక్షణతోనే ఆర్థిక ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో తలసరి కార్బన్ ఉద్గారాల పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. మన ప్రాచీన పర్యావరణ ఆలోచనలనే నేటి ఆధునిక పరిష్కారాలుగా మారుస్తూ ప్రకృతిని కాపాడుకుంటున్నామని తెలిపారు. భారత్ వాతావరణ వ్యూహంలో పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర అని మోడీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌర విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం 12 ఏళ్ల క్రితం 2 గిగావాట్లుగా ఉన్న మన సోలార్ సామర్థ్యం, ఈరోజు ఏకంగా 160 గిగావాట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు. ఒక్క సోలార్ ఎనర్జీ వల్లే దాదాపు 20 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలో కలవకుండా నిరోధించగలిగామని చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం కూడా గత 12 ఏళ్లలో మూడు రెట్లు పెరిగిందని, దీనికి తోడు జల విద్యుత్ రంగాన్ని కూడా విస్తరించామని చెప్పారు. వీటితో పాటు అణు విద్యుత్‌ను పెంచడానికి, క్లీన్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కృషి ఫలితంగానే గత పన్నెండేళ్లలో శిలాజయేతర ఇంధనాల ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మన దేశం, పారిస్ ఒప్పందంలో 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఐదేళ్ల ముందే, అంటే 2025లోనే సాధించింది. మొత్తం విద్యుత్ సామర్థ్యంలో 50 శాతానికి పైగా శిలాజయేతర ఇంధనాల నుంచే సాధించి భారత్ రికార్డు సృష్టించింది. గత 12 ఏళ్లలో పర్యావరణానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ భారత్ అసాధారణమైన ప్రగతి సాధించిందని, ఇందులో పునరుత్పాదక ఇంధనానిదే కీలక పాత్ర అని మోడీ కొనియాడారు.

# సీపీఐతో చర్చలు సానుకూలం

**అమరావతి, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**



ఆంధ్రప్రదేశ్‌లో అన్ని పార్టీలు ఇప్పుడు లోకల్‌బాడీ ఎన్నికలపై దృష్టి పెట్టాయి.. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై సీపీఎం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హాజరయ్యారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ఇతర వామపక్ష పార్టీలతో సమన్వయం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆర్ఎస్ఎస్ అగ్రనేత మోహన్ భగవత్ లౌకికవాదం సరిపోదని చెప్పడం సరికాదని బీవీ రాఘవులు వ్యాఖ్యానించారు. దేశ పరిపాలన ఏ ధర్మం ప్రాతిపదికన సాగాలని భగవత్ చెబుతున్నారో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. దేశ పరిపాలన పౌర ధర్మం ఆధారంగా జరగాలని, మత ధర్మాన్ని రాజ్య పరిపాలనకు ప్రాతిపదికగా చేయడం సరికాదని అన్నారు. యువత మనసులను కలుషితం చేసే ప్రయత్నాలను సీపీఎం వ్యతిరేకిస్తుందని, భగవత్ సూచనలను యువత తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, సెప్టెంబర్ 18న ఉజ్జయినిలో జరిగిన యువ ధర్మ సంసద్‌లో మోహన్ భగవత్ ధర్మం, లౌకికవాదంపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

ఇక, అమెరికా వాణిజ్య విధానాలపైనా రాఘవులు స్పందించారు. వంద శాతం టారిఫ్ విధిస్తామని అమెరికా చట్టంలో పేర్కొన్న తొమ్మిది దేశాల్లో భారత్ కూడా ఉందని అన్నారు. భారత్ అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్నప్పటికీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత్‌పై సరైన దృష్టి లేదని వ్యాఖ్యానించారు. అమెరికా దుందుడుకు చర్యలను ప్రధాని మోదీ వ్యతిరేకించాలని, అమెరికా చమురుపై ఆధారపడకుండా దేశ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఆ భారం నేరుగా ప్రజలపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీవీ రాఘవులు కోరారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల సామాన్య ప్రజలపై పడే ప్రభావాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు బీవీ రాఘవులు..

SIRపై తీవ్ర విమర్శలు

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపైనా రాఘవులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో SIR జరుగుతున్న తీరు ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వం దెబ్బతీస్తున్నట్లుగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణలో 40 లక్షలు, ఢిల్లీలో 30 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 35 లక్షల మందికి నోటీసులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియను 'కాన్స్టిట్యూషనల్ రిగ్గింగ్'గా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రయోజనాల కోసమే SIR ప్రక్రియ జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇవి రాఘవులు చేసిన రాజకీయ ఆరోపణ లేనని, వాటిపై సంబంధిత ప్రభుత్వాలు లేదా బీజేపీ వైఖరిని ఈ వ్యాఖ్యలు స్వతంత్రంగా నిర్ధారించవు. ఇక, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై SIR ప్రభావం ఉండకపోవచ్చని రాఘవులు అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థాయిల్లో ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతాయని, అందువల్ల SIR కారణంగా స్థానిక ఎన్నికలకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని అన్నారు. ఏపీలో SIR పూర్తయ్యే వరకు స్థానిక ఎన్నికలు నిర్వహించలేమని రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో హైకోర్టుకు తెలిపింది. అనంతరం స్థానిక ఎన్నికలకు అందుబాటులో ఉన్న ఓటర్ల జాబితాను ఉపయోగించవచ్చని రాష్ట్రం తరపున హైకోర్టులో వాదన కూడా జరిగింది.

సీపీఐతో చర్చలు సానుకూలం

స్థానిక ఎన్నికల్లో సీపీఎంతో కలిసి పోటీ చేసే అంశంపై సీపీఐతో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. మిగతా ఇండియా బ్లాక్ భాగస్వామ్య పార్టీలతోనూ చర్చలు జరిపి, ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజా సమస్యలను ఎన్నికల ఎజెండాగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ పార్టీలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సన్నాహాలు ప్రారంభించాయి. అధికార కూటమి కూడా గ్రామ, మండల స్థాయిలో సమన్వయం, స్థానిక సమస్యల పరిష్కారం, అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టింది.

# మంగళగిరిలో అట్టహాసంగా డబ్ల్యూఏపీఎల్ ప్రారంభం



**మంగళగిరి, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

మంగళగిరి స్టేడియంలో ఉమెన్ ఏపీఎల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నారా బ్రాహ్మణి , భారత జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో మంది మహిళలకు ఇది మంచి ప్లాట్‌ఫామ్ అని పేర్కొన్నారు. నెక్స్ట్ జనరేషన్ మహిళలకు ఈ టోర్నమెంట్ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. టాలెంట్ ఉండి అవకాశం దొరికితే.. నమ్మకంగా సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు.

ఈ సందర్భంగా ఉమెన్ ఏపీఎల్ ట్రోఫీని నారా బ్రాహ్మణి ఆవిష్కరించారు. విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్, గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణరంగారావు, సినీ నటి స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు. హేమచంద్ర, గీతామాధురి పాటలతో అలరించారు. ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ 1 మ్యాచ్‌లో భాగంగా అమరావతి ఈ ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు తలపడుతున్నాయి.

# చరిత్ర సృష్టించిన కండక్టర్ కుమారుడు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్**




ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మరోసారి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. అధ్యక్షుడు సహా కీలకమైన నాలుగు స్థానాల్లో మూడింటిని ఏబీవీపీ చేజిక్కించుకుంది. అయితే, ఉపాధ్యక్ష పదవి మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుచుకోవడం విశేషం. స్వతంత్రంగా పోటీచేసిన దీపాంశు షోకీన్ .. దాదాపు 14 వేల ఓట్ల భారీ మెజార్టీతో గెలిచి సరికొత్త చరిత్ర సృష్టించారు. దీపాంశుకు 30,615 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి, ఏబీవీపీ అభ్యర్థి ఈషు మౌర్యకు 16,910 ఓట్లు, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి వీర్ చత్రత్‌కు 4,313 ఓట్లు వచ్చాయి.

ఈ విజయంపై దీపాంశు మాట్లాడుతూ.. అన్ని కాలేజీల నుంచి తనకు లభించిన మద్దతు ఆధారంగా ఈ ఫలితాన్ని ముందే ఊహించినట్లు తెలిపారు. రాజకీయాల్లో చురుగ్గా ఉన్నవారే కాకుండా, తటస్థంగా ఉండే సాధారణ విద్యార్థులు కూడా తనకు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ''నేను ఈ తరహా ఫలితాన్ని ముందుగానే ఊహించాను... అన్ని కాలేజీల నుంచి నాకు మంచి మద్దతు లభించింది. ముఖ్యంగా సాధారణ విద్యార్థులు నా వెంట నిలిచారు. రాజకీయాల్లో భాగం కాని తటస్థ విద్యార్థులను చేరుకోవడం చాలా కష్టమైన విషయమే, కానీ 'ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థుల సంఘం గొంతుక' గా నిలిచిన నన్ను నమ్మి వారు నాకు మద్దతుగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని దీపాంశు వ్యాఖ్యానించారు.

సామాన్యుడి నుంచి సుప్రీమ్ లీడర్‌గా

ఢిల్లీలోని పీరాగఢికి చెందిన దీపాంశు తండ్రి ఒక ఆర్టీసీ బస్సు కండక్టర్ కాగా, తల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. భగత్ సింగ్ కాలేజ్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన దీపాంశును సివిల్ సర్వీస్ అధికారిగా చూడాలని ఆయన ఆయన తండ్రి కోరుకున్నారు. అయినప్పటికీ, విద్యార్థి రాజకీయాల్లోకి రావడానికే ఆయన మొగ్గుచూపారు. ఇటీవల ఢిల్లీలోని సత్య నికేతన్‌లో పీజీ హాస్టల్ భవనం కూలిపోయిన ఘటనలో బాధితులకు న్యాయం జరిగే వరకు చెప్పులు ధరించనని దీపాంశు ప్రతిజ్ఞ చేసి బలమైన నిరసన తెలిపారు. మొదట్లో ఎన్ఎస్‌యూఐ నుంచి టికెట్ ఆశించి నామినేషన్ వేసినప్పటికీ, ఆ తర్వాత నామినేషన్ వెనక్కి తీసుకోవాలని పార్టీ కోరింది. అందుకు నిరాకరించిన ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు.

ఇక, అధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను ఏబీవీపీ అభ్యర్థులు దక్కించుకున్నారు. అధ్యక్షుడిగా యష్ దబాస్ 24,576 ఓట్లు సాధించగా.. ఆయన ప్రత్యర్థి NSUI అభ్యర్థి విజయ్ శంకర్ మీనాకు 22,523 ఓట్లు వచ్చాయి. సెక్రెటరీగా గెలిచిన రియా ఛావడికి 21,650 ఓట్లు వస్తే.. NSUI అభ్యర్థి నమ్రతకు 14,869 ఓట్లు.. జాయింట్ సెక్రటరీగా లక్ష్యరాజ్ సింగ్ 16,615 ఓట్లు రాగా.. ప్రత్యర్థులైన సమాజ్‌వాదీ ఛాత్ర సభ అభ్యర్థి విశేష్ యాదవ్‌కు 15,778 ఓట్లు, NSUI అభ్యర్థి గోపాల్ యాదవ్‌కు 15,206 ఓట్లు లభించాయి.

# 'పేదలకు పట్టాభిషేకం'

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్‌గా మారనుందని తెలిపారు. విశాఖలో నీటి సమస్య లేకుండా వచ్చే ఏడాదిలోగా పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో నీటి కొరత రాకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతిలో 89.41 శాతం పచ్చదనం ఉందని, విశాఖను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలనేది తన లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అనేక భూ కుంభకోణాలు ఉన్నాయని చంద్రబాబు ఆరోపించారు. వాటన్నింటినీ అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో శాంతి లేకుండా చేశారని విమర్శించారు. రుషికొండలో నిర్మించిన భవనాలను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ఎన్ని డేటా సెంటర్లు వచ్చినా విశాఖకు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కూటమి ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోందని, పేదలకు ఇస్తున్న పట్టాలు వారి పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం వంటివని అన్నారు. అప్పుల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తెచ్చామని, రైల్వే జోన్ రావడంతో విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

వైసీపీ పాలన ఒక పీడకల: చంద్రబాబు

వైసీపీ పాలన రాష్ట్రానికి ఒక పీడకలని సీఎం చంద్రబాబు విమర్శించారు. నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూకబ్జాలకు పాల్పడ్డారని, చివరకు శ్రీవారి లడ్డూను కూడా కల్తీ చేశారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వైసీపీ కుట్రలు ఆగలేదని, మెగా DSCపై అనేక కేసులు వేశారని అన్నారు. కోర్టులు చివాట్లు పెట్టడంతో ఇప్పుడు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. విశాఖకు కంపెనీలు రాకుండా తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. దేవాలయ భూములకు సంబంధించిన న్యాయపరమైన చిక్కులను తొలగిస్తామని తెలిపారు. గత రెండేళ్లలో 5.50 లక్షల ఇళ్లను నిర్మించి ఇచ్చామని, వచ్చే మార్చిలో మరో 5.52 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.



# హోం మంత్రి అమిత్ షాకు అస్వస్థత

**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**



కర్ణాటక పర్యటనలో ఉన్న కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా శనివారం అస్వస్థతకు గురయ్యారు. హుబ్బళ్లిలో రూ.700 కోట్లతో నిర్మించిన కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసావిరమఠ్ వైద్య కళాశాల భవనంతోపాటు, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్‌ను అమిత్ షా శనివారం ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రే ఆయన హుబ్బళ్లికి చేరుకున్నారు. ఈ క్రమంలో అస్వస్థతకు హోమ్ మంత్రి గురికావడంతో డాక్టర్ల సలహా మేరకు ప్రారంభోత్సవానికి హాజరుకాకుండా హోటల్‌కే పరిమితమయ్యారు.

ఈ కార్యక్రమానికి అమిత్ షా దూరంగా ఉండటంతో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, కేఎల్‌సీ సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్ కోరే మాట్లాడుతూ.. ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి అమిత్ షా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. ఆరోగ్య కారణాల రీత్యా దూరంగా ఉన్నారని అన్నారు. కాగా, హుబ్బళ్లికి చేరుకున్న అమిత్ షాకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సాదర స్వాగతం పలుకుతూ.. ఈ సంస్థ ఉత్తర కర్ణాటకలో వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. ''ఈరోజు హుబ్బళ్లి విమానాశ్రయానికి విచ్చేసిన గౌరవ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సాదర స్వాగతం. ఉత్తర కర్ణాటకలో వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందించే కేఎల్ఈ సొసైటీకి చెందిన జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరసవీర్మఠ్ మెడికల్ కాలేజ్ (జేజీఎంఎంఎంసీ), హాస్పిటల్, మెడికల్ రిసెర్చ్ సెంటర్ ప్రారంభోత్సవం కోసం ఆయన ఇక్కడికి విచ్చేశారు'' అని జోషి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో రూ. 700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మెడికల్ కాలేజీలో 30 లక్షల చదరపు అడుగులకుపైగా నిర్మిత ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో వైద్య విద్య, అధునాతన ఆరోగ్య సంరక్షణ, డయాగ్నోస్టిక్స్, చికిత్స, వైద్య పరిశోధనలను బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ కొత్త మెడికల్ కాలేజ్, ఆసుపత్రిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థలు, అత్యాధునిక వైద్య పరికరాలు సహా ఆధునిక సాంకేతికతను ఏర్పాటు చేసినట్లు కేఎల్ఈ విశ్వవిద్యాలయం ఛాన్స్‌లర్ ప్రభాకర్ కోరే తెలిపారు.

# శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి.. విద్యార్థులకు అజిత్ డోభాల్ పిలుపు



శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పిలుపునిచ్చారు. రాముడి ధైర్యసాహసాల వల్లే విశ్వామిత్రుడు రాక్షస సంహారానికి ఆయన్ని ఎంచుకున్నారని వివరించారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా అజిత్ డోభాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు.

అద్భుతమైన భవిష్యత్ దిశగా భారత్ పరుగులు తీస్తోందని చెప్పారు.

ప్రధాని మోదీ చెప్పినట్లుగా భారత్‌కు 2047 వరకు అమృత్ కాలమని డోభాల్ అన్నారు. ప్రస్తుతం 4.015 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రానున్న 20 ఏళ్లలో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా తన ఉద్యోగ జీవితం ప్రారంభంలో ఎదురైన అనుభావాలను విద్యార్థులతో పంచుకున్నారు. సిక్కింలో ఉద్యోగం చేస్తున్న సమయంలో అక్కడ మౌంటైన్ గైడ్‌గా పని చేస్తున్న వ్యక్తి నుంచి మూడు విజయ సూత్రాలను నేర్చుకున్నట్లు చెప్పారు. మనం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకోవడం మొదటి సూత్రం. ఎక్కడికి వెళ్లాలో తెలుసుకోవడం రెండోది (కచ్చితమైన లక్ష్యం). అక్కడికి వెళ్లి తిరిగి ఎలా రావాలో తెలుసుకోవడం మూడోది. ఈ మూడు సూత్రాలూ.. విజయానికి చక్కటి మార్గాలని డోభాల్ తెలిపారు.

# ఎగ్జామ్ హాల్‌లో ఫోన్‌తో దొరికి.. ఐఐటీ బాంబే విద్యార్థి ఆత్మహత్య



ఐఐటీ బాంబేకు చెందిన పవయి క్యాంపస్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల అతడు పరీక్ష హాల్‌లో మొబైల్ ఉపయోగించి దొరికిపోయాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి తన హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం.

ఇనిస్టిట్యూట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రెండో సంవత్సరం చదువుతోన్న సాహిల్ (19).. ఇటీవల పరీక్ష జరుగుతుండగా మొబైల్ ఫోన్ వినియోగించాడు. ప్రశ్న పత్రాన్ని చాట్‌జీపీటీ లో అప్‌లోడ్ చేస్తూ దొరికిపోయాడు. ఇందుకు గానూ అధికారులు అతడిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టలేదు. అయితే, డిపార్ట్‌మెంట్ హెడ్.. సాహిల్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఇనిస్టిట్యూట్ అధికారులు పేర్కొన్నారు. అయినప్పటికీ సాహిల్ బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపింది. ఈ ఏడాది ఐఐటీ బాంబేలో చోటుచేసుకున్న నాలుగో మరణం ఇది. దీంతో నిన్న రాత్రి క్యాంపస్‌లో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వరుస ఆత్మహత్యలపై యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల నేపథ్యంలో క్యాంపస్‌లో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. మరోవైపు, ఘటనపై ఐఐటీ బాంబే ప్రకటన విడుదల చేసింది. ''విద్యార్థి మరణం పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాం. ఈ విచారకర సమయంలో మృతుడి స్నేహితులు, కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటిస్తున్నా. ఘటనకు గల కారణాలపై సంబంధిత అధికారులతో దర్యాప్తు చేస్తున్నాం'' అని తమ ప్రకటనలో వెల్లడించింది.

# సంపూర్ణ మద్య నిషేధంతో నష్టాలే ఎక్కువ: సుప్రీంకోర్టు



సంపూర్ణ మద్య నిషేధం అసలు సమస్యను పరిష్కరించకపోగా ఇతరత్రా అనేక కష్టనష్టాలకు కారణమవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అక్రమ సారా వ్యాపారాలు, కల్తీలు, దొంగచాటు రవాణాలు, రహస్యంగా మద్యం తాగడం వంటివాటికి ఇది దారితీస్తుందని హెచ్చరించింది. ప్రభుత్వాలు పన్ను రాబడులను కోల్పోవడంతో పాటు మద్య నిషేధం అమలుకు భారీగా ఖర్చుపెట్టాల్సి వస్తుందంటూ పలు నిదర్శనాలను ప్రస్తావించింది. కల్తీమద్యం సమస్యను నివారించేందుకు గాను ఔషధేతర తయారీదారులకు విక్రయించే మిథనాల్‌కు రంగు, చేదు రుచిని జోడించాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిబంధనను శుక్రవారం కొట్టివేస్తూ వెలువరించిన తీర్పులో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి నోద్‌చంద్రన్ ధర్మాసనం ఈ విషయాలను పేర్కొంది. కల్తీమద్యం మరణాల నివారణకు గాను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పలు సూచనలు చేసింది. ''రంగు, రుచిని మార్చడం వల్లకానీ, అందుబాటులో లేకుండా చేయడం వల్ల కానీ మద్యం తాగాలన్న తీవ్రమైన తృష్ణను వ్యసనపరులు వదులుకోలేరు. దీనికి బదులుగా ఎక్సైజ్ చట్టాలను బలోపేతం చేసి మద్యం రవాణా, నిల్వ, తయారీపై కఠిన నియంత్రణలను అమలుచేయడం ఉత్తమం. మిథనాల్‌కు రంగు, చేదు రుచిని జోడించాలన్న మహారాష్ట్ర నిబంధనలు ఔషధేతర ఉత్పత్తిదారుల పరిశ్రమలను దెబ్బతీస్తాయి. మిథనాల్ విక్రయాలు, సరఫరాపై గట్టి నియంత్రణ చర్యలు అవసరం. మహారాష్ట్ర ప్రభుత్వ తీసుకొచ్చిన నిబంధనలు రాజ్యాంగబద్ధంగా, సహేతుకంగా లేవు'' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

## రూ.8వేలకు ప్రశ్నపత్రాన్ని బయటకు పంపి..

# టెట్ పేపర్ లీకేజీలో సంచలన విషయాలు..!



మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆగ్రాలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఈ ప్రశ్నపత్రాలను ఇద్దరు ఉద్యోగులు షూ ఇన్‌సోల్‌లో దాచి బయటకు తరలించినట్లు పోలీసులు తమ ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను దొంగిలించినందుకు గానూ.. ఆ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి నిందితులు రూ.8 వేల చొప్పున చెల్లించినట్లు తెలిపారు. దీంతో పాటు ఆగ్రాలో భూమి స్థలాలు ఇప్పిస్తామని నిందితులు హామీ ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటివరకు 16 మందిని అరెస్టు చేయగా.. ఇద్దరు కీలక నిందితులు పరారీలో ఉన్నారు.

ఈ ఏడాది జూన్ 28న మహారాష్ట్రలో టెట్ పరీక్ష జరగాల్సి ఉండగా.. ఒకరోజు ముందు పేపర్ లీక్ వ్యవహారం బయటపడింది. దీంతో నాటి పరీక్షను వాయిదా వేశారు. భివండీకి చెందిన ఓ వ్యక్తికి ప్రశ్నపత్రాలు విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే ముందస్తు సమాచారంతో పోలీసులు అప్రమత్తమై.. వారి నుంచి నాలుగు సెట్ల పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. అవి నిజమైన ప్రశ్నపత్రాలేనని మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారులు నిర్ధరించారు. టెట్ పేపర్ల ముద్రణ బాధ్యతలను ఆగ్రాలోని ఓ సంస్థకు అప్పగించారు. అధికారులు నాలుగు సెట్ల ప్రశ్నపత్రాలను సిద్ధం చేయగా.. ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే ఉద్యోగులు అన్నింటినీ బయటకు తీసుకెళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. భద్రతా సిబ్బంది రోజూ ఉద్యోగుల దుస్తులను తనిఖీ చేస్తున్నా.. బూట్లను పరిశీలించకపోవడాన్ని వారు అనుకూలంగా మలచుకుని ఈ లీక్‌కు పాల్పడ్డట్లు తెలిపారు. ఈ కేసులో కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు బిజేంద్ర గుప్తాను ప్రధాన సూత్రధారిగా చేర్చారు. అతడిపై గతంలో ఒడిశా పేపర్ లీక్ కేసులోనూ ఆరోపణలు ఉన్నాయి.

# మహిళను కొట్టి చంపి.. ఏడుస్తున్న చిన్నారిని ఆమె మృతదేహంపై ఉంచిన హంతకులు



కొందరు వ్యక్తులు ఒక మహిళను కొట్టి చంపారు. ఏడుస్తున్న కుమార్తె అయిన ఏడాదిన్నర వయస్సున్న చిన్నారిని ఆమె మృతదేహంపై ఉంచి పారిపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ మహిళ భర్త, ఆమె ప్రియుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సింధనూర్ సబ్ డివిజన్‌లోని ఆర్‌హెచ్ క్యాంప్ ప్రాంతంలో నివసించే 25 ఏళ్ల స్నేహపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. రాయితో ఆమె తలపై కొట్టి చంపారు. ఏడుస్తున్న ఏడాదిన్నర వయస్సున స్నేహ కుమార్తెను ఆమె మృతదేహంపై ఉంచి అక్కడి నుంచి పారిపోయారు.

కాగా, గ్రామం శివార్లలోని పొలంలో స్నేహ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుమార్తె అయిన చిన్నారి చనిపోయిన తన తల్లిని గట్టిగా పట్టుకుని నిస్సహాయంగా ఏడుస్తూ కనిపించింది. ఇది చూసి పోలీసులు, స్థానికులు చలించిపోయారు. ఆ మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు నాలుగేళ్ల కిందట అమిత్‌తో స్నేహకు వివాహం జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు. గత నాలుగు నెలలుగా శుభమ్ అనే వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ నేపథ్యంలో స్నేహ భర్త, ఆమె ప్రియుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను హత్య చేసిన వ్యక్తులు, అందుకు కారణాలు తెలుసుకునేందుకు వారిద్దరిని ప్రశ్నిస్తున్నారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ఆంగ్ల భాషపై శశిథరూర్‌కు ఉన్న పట్టు అంతాఇంతా కాదు..

# అయినా గ్రామర్ మిస్టేక్ చేశారు..!

ఆంగ్ల భాషపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ కు ఉన్న పట్టు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన మాట్లాడే తీరు, వాడే పదాలు, రచనా శైలి.. పాశ్చాత్య దేశాల పండితులను సైతం మరిపిస్తాయి. అనేక సందర్భాల్లో ఆయన వాడిన పదాలు నెట్టింట్లో చర్చకు దారితీశాయి. అంతటి పట్టున్న వ్యక్తి ఇంగ్లిష్‌లో తప్పు చేశాడంటే ఎవరైనా నమ్ముతారా..? కానీ అంతటి వ్యక్తి సైతం మిస్టేక్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ థరూర్ చేసిన సోషల్ మీడియా పోస్ట్‌లో ఓ చిన్న వ్యాకరణ దోషం దొర్లింది. దాన్ని నెటిజన్లు గుర్తించడంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. సెప్టెంబర్ 17న మోదీ 76వ పుట్టినరోజు సందర్భంగా థరూర్ 'ఎక్స్' లో శుభాకాంక్షలు తెలిపారు. అయితే 'ఆయన 76వ పుట్టినరోజు సందర్భంగా' అనే అర్థం వచ్చేలా అని రాయాల్సింది పోయి అని రాశారు. దాంతో ఆ చిన్న తప్పిదం కాస్తా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ పోస్టుపై పలువురు నెటిజన్లు స్పందించారు. ఇది వ్యాకరణ తప్పిదమా..? టైపింగ్ పొరపాటా..? అంటూ చర్చించారు. కీబోర్డులో 'I', 'O' అక్షరాలు పక్కపక్కనే ఉండటంతో పొరపాటు జరిగి ఉండొచ్చని కొందరు సరదాగా చెప్పారు. మరికొందరు మాత్రం థరూర్ లాంటి ఇంగ్లిష్ పండితుడి నుంచి ఇలాంటి తప్పు రావడమే ఆశ్చర్యంగా ఉందంటూ కామెంట్లు చేశారు. అయితే ఈ విమర్శలను థరూర్ పట్టించుకోకుండా వదిలేయలేదు. ఓ నెటిజన్ కామెంట్‌కు థరూర్ స్పందిస్తూ తన పొరపాటును స్వయంగా అంగీకరించారు. 'ఆయన పుట్టినరోజు సందర్భంగా' రాయాల్సిన చోట 'in' వచ్చిందని, ఇలాంటి పొరపాట్లు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉంటాయని సరదాగా బదులిచ్చారు. దాంతో ఈ చిన్న వ్యాకరణ పొరపాటు సోషల్ మీడియాలో సరదా చర్చగా మారింది. సాధారణంగా థరూర్ రాసే క్లిష్టమైన ఇంగ్లిష్ పదాల కంటే ఈసారి ఓ చిన్న పదమే అందరి దృష్టినీ ఆకర్షించింది.



## ఇంకా మగబిడ్డకే ప్రాధాన్యమా?..

# బాంబే హైకోర్టు ప్రశ్న



కుటుంబంలో మరో ఆడపిల్ల పుట్టిందన్న అక్కసుతో నెల రోజులు కూడా నిండని మనవరాలిని హత్య చేసిన వ్యక్తికి బెయిలు మంజూరు చేసేందుకు బాంబే హైకోర్టు నిరాకరించింది. స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు కావస్తున్నా కొందరు ఇంకా మగ సంతానమే కోరుకోవడం దురదృష్టకరమని కోర్టు అభిప్రాయపడింది. నాగ్‌పుర్ బెంచికి చెందిన జస్టిస్ ఎం.ఎం.నెర్లీకర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. నిందితుడు గోపీనాథ్ జంకూ ప్రధాన్ బెయిలు కోసం చేసుకున్న అభ్యర్థనను ఆయన తిరస్కరించారు. తూర్పు మహారాష్ట్రలోని గచ్చిరోలి జిల్లా పోలీసులు నిందితునిపై 2023లో కేసు నమోదు చేశారు. హత్యకు పాల్పడటంతోపాటు అందుకు సంబంధించిన సాక్ష్యాలను చెరిపేశాడని అతనిపై అభియోగం. తన కుమారునికి మళ్లీ ఆడబిడ్డ పుట్టిందనే అక్కసుతో నిందితుడు నెల రోజులు కూడా నిండని ఆడబిడ్డను నీటిలో ముంచి హతమార్చాడని పోలీసుల కథనం. తాను నిర్దోషినని నిందితుడు కోర్టుకు విన్నవించాడు. కేసులో సహనిందితురాలైన బిడ్డ తల్లికి బెయిలు మంజూరైన విషయాన్ని న్యాయస్థానానికి తెలియజేశాడు. ''స్వాతంత్ర్యం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ మన దేశంలో ప్రజలు మగబిడ్డే కావాలని కోరుకోవడం దురదృష్టకరం'' అని జస్టిస్ నెర్లీకర్ వ్యాఖ్యానించారు.

## ఎమ్మెల్యే ఖాతా నుంచి

# రూ.1.55 లక్షలు చోరీ



సైబర్ కేటుగాళ్లు ఏకంగా ఎమ్మెల్యేనే బురిడీ కొట్టించారు. ఆమె బ్యాంకు ఖాతా నుంచి దశలవారీగా రూ.1.55 లక్షలు మాయం చేశారు. ఈ మేరకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే పూజా పాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 13 మధ్య కాలంలో దశలవారీగా డబ్బు తీశారని పేర్కొన్నారు. తన ఫోన్‌ను ఎవరో హ్యాక్ చేసి ఫోన్ పే ద్వారా ఈ మోసానికి పాల్పడి ఉండొచ్చని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పూజా పాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిపారు. ఆమె ప్రస్తుతం చైల్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు.

# అమ్మాయితో ట్రిప్.. భార్యను మభ్యపెట్టేందుకు ఇమిగ్రేషన్ నాటకం

భార్యకు తెలియకుండా ఓ అమ్మాయితో ఫారెన్ ట్రిప్‌నకు వెళ్తుండగా.. పాస్‌పోర్ట్ సమస్య తలెత్తడంతో వ్యాపారవేత్త ప్లాన్ బెడిసి కొట్టింది. దానిని కవర్ చేసేందుకు భార్యకు అబద్ధం చెప్పడంతో చివరికి పోలీసులకు చిక్కాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

పుణెకు చెందిన 46 ఏళ్ల వ్యాపారవేత్త ఓ యువతితో ఫారెన్ ట్రిప్ వెళ్లడానికి ప్లాన్ చేసుకున్నారు. వ్యాపార పర్యటన నిమిత్తం మలేషియాలోని కౌలాలంపూర్ వెళ్తున్నానని తన భార్యకు చెప్పాడు. ట్రిప్ కోసం యువతితో ముంబయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇమిగ్రేషన్ తనిఖీల సమయంలో ఆమె గడువు ముగిసిన పాస్‌పోర్టు ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వారిని అడ్డుకున్నారు. గడువు ముగిసిన పత్రాలతో అధికారులను మోసం చేయడానికి ప్రయత్నించినందుకు లీగల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లీగల్ చర్యలు తీసుకుంటే అమ్మాయి విషయం తన భార్యకు తెలిసిపోతుందని భావించిన వ్యాపారవేత్త ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి ఓ ప్లాన్ వేశారు.

విమానాశ్రయంలోని ల్యాండ్ లైన్ నుంచి తన భార్యకు ఫోన్ చేసి, ఇమిగ్రేషన్ సమస్య వల్ల తన మొబైల్ ఫోన్‌ను అధికారులకు అప్పగించాల్సి వచ్చిందని తెలిపారు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, అక్కడి నుంచి వారు మరో ప్రాంతానికి వెళ్లారు. వ్యాపారవేత్త మరుసటి రోజు కూడా భార్యతో తన వాట్సాప్ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఫోన్ అందుబాటులో లేకుండా పోయింది. దీంతో అతడి భార్య పోలీసులను ఆశ్రయించారు. తన భర్తను ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తన గురించి వెతుకుతున్నట్లు తెలుసుకున్న వ్యాపారవేత్త పోలీస్ స్టేషన్ వెళ్లి వారికి అసలు విషయం చెప్పాడు. ఫారెన్ ట్రిప్ విషయం తన భార్యకు తెలియకుండా ఉండేందుకు ఇమిగ్రేషన్ కథ అల్లినట్లు తెలియజేశారు. దీంతో ఆశ్చర్యపోవడం వారి వంతైంది.

# హనీమూన్ ట్రిప్‌లో విషాదం.. బార్బెక్యూ ఫైర్‌లో నవవధువుకు తీవ్ర గాయాలు

పశ్చిమ బెంగాల్‌లోని దార్జిలింగ్‌లో హనీమూన్‌కు వెళ్లిన నవ దంపతులకు ఊహించని రీతిలో ప్రమాదం ఎదురైంది. ఓ వసతి గృహంలో బార్బెక్యూ సిద్ధం చేస్తుండగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నవ వధువు తీవ్ర గాయాలపాలైంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన భర్తకూ గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.పశ్చిమ బెంగాల్‌లోని 24 నార్త్ పరగణాల జిల్లాకు చెందిన సమీర్ దాస్‌కు నిఖిత సాహాతో రెండు నెలల క్రితమే వివాహం జరిగింది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం హనీమూన్ కోసం దార్జిలింగ్‌లోని సిటోంగ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ హోమ్‌స్టే చేస్తున్న సమయంలో బయట కూర్చొని బార్బెక్యూ సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది బార్బెక్యూపై ఓ ద్రావణాన్ని పోయగా.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు నిఖితకు అంటుకోవడంతో ఆమె తీవ్ర గాయాలపాలయ్యారు. 60శాతం కాలిన గాయాలతో సిలిగుడిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను కాపాడబోయిన భర్త సమీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఈ వ్యవహారంలో హోమ్‌స్టే నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోలేదని సమీర్ కుటుంబీకులు ఆరోపించారు. కనీసం నిఖితను ఆసుపత్రికి తరలించేందుకు కూడా ఎలాంటి వాహనం సమకూర్చలేదన్నారు. అయితే, ఉద్యోగి నిర్లక్ష్యం కనిపిస్తోందని, వంట నూనెకు బదులు కిరోసిన్ పోయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని హోమ్‌స్టే నిర్వాహకుడు అంగీకరించాడు. దీనిపై బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





## అందరికీ 'ప్రామాణిక సమయం'

**భారత ప్రామాణిక కాలమాన (ఐఎస్‌టీ) నిబంధనలు- 2026ను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 27న నోటిఫై చేసింది. దీంతో భారతదేశం తన అధికారిక, వాణిజ్య, పాలనపరమైన అవసరాల కోసం ఐఎస్‌టీని చట్టపరమైన సమయ సూచికగా మార్చే దిశగా ముందడుగు వేసింది. ఈ నూతన నిబంధనలకు అనుగుణంగా సంస్థలు తమ సిస్టమ్‌లను మార్చుకోవడానికి 180 రోజుల గడువునిచ్చారు. ఆ తర్వాత ఈ నిబంధనలు పూర్తిగా అమల్లోకి వస్తాయి. బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు, టెలికాం సేవలు, రవాణా వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్‌లు, ప్రభుత్వ నెట్‌వర్క్‌లన్నీ ఇప్పుడు కచ్చితమైన, ధ్రువీకరించదగిన టైమ్‌స్టాంప్‌పై ఆధారపడుతున్నాయి. అందుకే భారత కాలమాన వ్యవస్థలో తెస్తున్న మార్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నూతన వ్యవస్థ వల్ల దేశంలో ఏం మారనుంది? కీలక రంగాలపై దీని ప్రభావం ఎలా ఉంటుంది? వంటి అంశాలపై సీఎస్ఐఆర్-నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ (ఎన్‌పీఎల్) టైమ్ అండ్ ఫ్రీక్వెన్సీ మెట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ పూనమ్ అరోరా... 'ఈటీవీ భారత్' ప్రతినిధి సౌరభ్ శుక్లాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది...**

**ఐఎస్‌టీని చట్టపరమైన సూచికగా మార్చడం వల్ల లాభమేంటి?**

భారతదేశం దశాబ్దాలుగా ఐఎస్‌టీని పాటిస్తున్నా, దీనికి ప్రత్యేక చట్టపరమైన రక్షణ లేదు. కొత్త మార్పు అధికారిక, చట్టపరమైన ప్రయోజనాల కోసం ఐఎస్‌టీని తిరుగులేని విశ్వసనీయ సూచికగా స్థిరపరుస్తుంది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో నేషనల్ మెట్రాలజీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే సమయాన్నే చట్టపరమైన సమయంగా పరిగణిస్తారు. మన దేశంలోనూ ఐఎస్‌టీ జాతీయ సూచికగా ఉన్నప్పటికీ, సంస్థలు తమ సిస్టమ్‌లను ఐఎస్‌టీ ట్రేసబుల్ టైమ్‌తో సింక్రొనైజ్ చేయాలనే కఠిన నిబంధన గతంలో లేదు. మరోవైపు మన కార్యకలాపాలు ఎక్కువగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, సోషల్ మీడియా, హై-స్పీడ్ ట్రేడింగ్ సేవలకు మారిపోయాయి. ఇలాంటి వేదికల్లో లావాదేవీల కచ్చితమైన సమయాన్ని గుర్తించడం ద్వారా సైబర్ మోసాలు, వివాదాలను పరిష్కరించడంలో ఈ కొత్త చట్టం ఎంతో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు ఒక స్టాండ్‌అలోన్ కంప్యూటర్‌లో ఎవరైనా మాన్యువల్‌గా సమయాన్ని మార్చవచ్చు. కానీ చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అమల్లోకి వచ్చిన తర్వాత అది కుదరదు. ఒక సంస్థ తన సిస్టమ్‌లోని టైమ్‌స్టాంప్ మాన్యువల్‌గా నమోదు చేసింది కాదని, కచ్చితంగా ఐఎస్‌టీకి ట్రేసబుల్‌గా ఉందని నిరూపించాల్సి ఉంటుంది.

**ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, సరైన ఐఎస్‌టీ టైమ్‌స్టాంప్‌ను చేతి గడియారం లేదా ఫోన్ ద్వారా తనిఖీ చేయవచ్చా?**

అలా నేరుగా నిర్ధారించడం సాధ్యం కాదు. అయితే, సాధారణ వినియోగదారులు నేరుగా స్మార్ట్‌ఫోన్‌లో ఐఎస్‌టీని చూసేలా ప్రత్యేకంగా ఒక అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం. దానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న ఏకపక్ష సమయ మూలాలపైన, ముఖ్యంగా దేశం వెలుపల ఉన్న సర్వర్‌లపైన ఆధారపడటాన్ని ఇది తగ్గిస్తుంది. దీనివల్ల సంస్థలు పూర్తిగా స్వదేశీ జాతీయ సమయ సూచికపై ఆధారపడగలుగుతాయి.

**కొత్త నిబంధనల అమలుకు ఎలాంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు?**

ఈ నిబంధనలను తప్పనిసరి చేసే ముందు మూలాలను బలోపేతం చేయడానికీ, బహుళ ఛానెళ్ల ద్వారా ప్రామాణిక సమయం అందుబాటులో ఉంచడానికీ అహ్మదాబాద్, బెంగళూరు, ఫరీదాబాద్, భువనేశ్వర్, గువాహటిలలోని అయిదు ప్రాంతీయ కేంద్రాల్లో సెకండరీ అటామిక్ టైమ్‌స్కేల్స్‌ను ఏర్పాటు చేశాం. దీనివల్ల సమయం కోసం ఎన్‌పీఎల్‌పై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

**కీలక వ్యవస్థలకు చట్టపరమైన జాతీయ సమయ సూచిక ఎందుకు ముఖ్యం?**

వివిధ రంగాలకు విభిన్న స్థాయుల్లో సమయ కచ్చితత్వం అవసరం. ఇస్రోకు తన ఉపగ్రహ కార్యకలాపాల కోసం నానో సెకండ్ స్థాయి సమయ కచ్చితత్వం కావాలి. బ్యాంకులకు మిల్లీసెకండ్ స్థాయి కచ్చితత్వంతో సేవలు అవసరపడతాయి. అనేక బ్యాంకులు ఇప్పటికే ఉచితంగా అందుబాటులో ఉన్న ఎన్‌పీఎల్ నెట్‌వర్క్ టైమ్ ప్రోటోకాల్ (ఎన్‌టీపీ) సేవలను ఉపయోగిస్తున్నాయి, ఈ సేవలను కొన్ని బ్యాంకులు ఉపయోగించుకోవడం లేదు. కానీ నిబంధనలు అమలులోకి వచ్చిన తర్వాత, నిర్దేశిత అధికారిక మూలాల నుంచి సమయాన్ని పొందాల్సి ఉంటుంది. వాటి టైమ్‌స్టాంప్‌లు ఒకే జాతీయ సూచికకు కనెక్ట్ అవుతాయి.

**వివాదాలను లేదా టైమ్‌స్టాంప్‌ల తారుమారును ఎలా నివారిస్తారు?**

ఉదాహరణకు తత్కాల్ వంటి ఆన్‌లైన్ సిస్టమ్‌లో బుకింగ్ ప్రారంభమైన వెంటనే తాను లాగిన్ అయ్యానని, కానీ అప్పటికే టికెట్లు అయిపోయాయని ప్రయాణికుడు చెప్పవచ్చు. సర్వర్ సమయాన్ని మార్చగలిగితే, సిస్టమ్ వాస్తవంగా ఎప్పుడు ప్రారంభమైందనే దానిపై వివాదం రావొచ్చు. కానీ సర్వర్‌ను చట్టపరంగా గుర్తించిన జాతీయ సూచికతో సింక్రొనైజ్ చేస్తే, టైమ్‌స్టాంప్ ధ్రువీకరణ వల్ల సిస్టమ్ గడియారాన్ని తారుమారు చేయడం కష్టమవుతుంది. బ్యాంకింగ్, ట్రేడింగ్, ఇతర డిజిటల్ లావాదేవీలకూ అదే సూత్రం వర్తిస్తుంది.

**సాధారణ పౌరులు, వ్యాపారాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది?**

సాధారణ పౌరులకు రోజువారీ జీవితంలో పెద్దగా మార్పు ఉండదు. మొబైల్ ఫోన్లు టెలికాం నెట్‌వర్క్ ద్వారా సమయాన్ని పొందుతాయి. టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు తమ సిస్టమ్‌లను ఐఎస్‌టీతో సింక్రొనైజ్ చేస్తే వినియోగదారులకు సరైన సమయం లభిస్తుంది. అత్యంత కచ్చితత్వం అవసరమైన వ్యూహాత్మక రంగాలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్షన్లు లేదా వైట్ రాబిట్ టెక్నాలజీ వంటి అధునాతన పద్ధతులు ఉపయోగపడతాయి. వైట్ రాబిట్ అనేది ప్రిసిషన్ టైమ్ ప్రోటోకాల్‌కు ఆధునిక రూపం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ దీన్ని ఉపయోగిస్తోంది. 180 రోజుల పరివర్తన కాలంలో మిల్లీసెకండ్ స్థాయి కచ్చితత్వం కోసం ఎన్‌టీపీ సేవలను ఉపయోగించవచ్చు. అధిక కచ్చితత్వం కావాల్సినచోట మాత్రమే ప్రత్యేక పరికరాలు అవసరమవుతాయి.

# నీలి విప్లవంలో నవభారత శకం

**'సబ్‌కా సాథ్.. 'సబ్‌కా వికాస్.. 'సబ్‌కా విశ్వాస్.. 'సబ్‌కా ప్రయాస్' అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వ తారకమంత్రం. భారతదేశ అభివృద్ధి ప్రస్థానాన్ని అది సదా సార్వజనీనంగా, సర్వతోముఖంగా నిలుపుతోంది. గడచిన పాతికేళ్లలో కోట్లాది ప్రజల, ప్రత్యేకించి పేద–అణగారిన వర్గాలవారి జీవితాలను మోదీ తన విశిష్ట పాలనా దక్షతతో అమితంగా ప్రభావితం చేశారు. ఆర్థిక ప్రగతిపై ఆయన విధానం అందరికీ ఆదర్శప్రాయం. వెనుకబడిన జిల్లాలను 'ఆకాంక్షాత్మక జిల్లాలు'గా, సరిహద్దు గ్రామాలను 'సమర్థ–ప్రథమ గ్రామాలు'గా, ఈశాన్య ప్రాంతాన్ని 'అష్టలక్ష్మి'గా అభివర్ణించడం ఆయన పరిణామాత్మక దృక్పథానికి ప్రతీక. ఈ విధానం భౌగోళిక వివక్షను సాధికారతగా రూపుదిద్ది, వికసిత భారత్ దిశగా ప్రస్థానంలో వివిధ వర్గాల క్రియాశీల భాగస్వామ్యానికి బాటలు వేసింది. 'పీఎం జన్మాన్, పీఎం జన్-ధన్, పీఎం- గరీబ్ కల్యాణ్ యోజన' వంటి పథకాలే ఈ విజయానికి నిదర్శనం. వీటితో పాటు ఇతరత్రా అమలుపరుస్తోన్న కార్యక్రమాలు కూడా సార్వజనీన ప్రగతి, సామాజిక సాధికారతపై ప్రధానమంత్రి నిబద్ధతను చాటిచెబుతున్నాయి. కనుకనే దేశవ్యాప్తంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారు. ఈ అపూర్వ పురోగతి మన జాతి జీవనంలోనే కాకుండా సమస్త మానవాళి చరిత్రలో కూడా ఒక చిరస్మరణీయ మలుపు. ప్రపంచవ్యాప్తంగా పేదరికం, ఆకలి దప్పుల నుంచి నిరుపేదలు శాశ్వతంగా బయటపడే రోజు త్వరలోనే తప్పక వస్తుందనడానికి ఈ భారత విజయం ఒక శుభ సంకేతం.**



ఈ సార్వజనీన వృద్ధికి మరింత భరోసా, సుస్థిరత కల్పించేందుకు ప్రధాని మోదీ 'నీలి ఆర్థిక వ్యవస్థ'పై దృష్టి సారించారు. హరిత విప్లవం 1960ల్లో దేశ ప్రజల క్షుద్బాధను తీర్చింది. తదాదిగా ప్రపంచ ఆహార భద్రతలో భారత్ పాత్ర మరింత పటిష్ఠమవుతోంది. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తిలో భారత్ నేడు ప్రపంచ అగ్ర దేశాలలో ఒకటిగా నిలిచింది. హరిత విప్లవం శ్వేత విప్లవంతో దేశంలో పాల కొరత తీరిపోయింది. పాడి ఉత్పత్తులపై మన పరాధీనత తొలగిపోయింది. భారత్ ఇప్పుడు పాడి ఉత్పత్తులలో ప్రపంచ అగ్రగామిగా వెలుగొందుతోంది. ఈ ఆహారోత్పత్తి విజయాలతో ప్రజల్లో, ముఖ్యంగా బాలల్లో పోషకాహార లోపం గణనీయంగా తగ్గింది.

మన విజయగాథలో ఇవాళ నీలి విప్లవం మరో ఉజ్వల అధ్యాయంగా నిలుస్తోంది. ప్రకృతి మాత కరుణతో మన దేశానికి 11,000 కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతం సమకూరింది. ప్రాచీన కాలం నుంచీ సముద్రయానం, విదేశీ వాణిజ్యంలో మనకొక సుసంపన్న సంప్రదాయం కూడా ఉంది. అలాగే, మనకు మన భూభాగాల పరివేష్ఠిత సముద్రాలలో దాదాపు 24 లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్) కూడా ఉంది. సముద్ర సంపదపరంగానూ ప్రపంచంలో భారత్ కీలక స్థానంలో నిలుస్తోంది.

ప్రధాని మోదీ ప్రభుత్వం 2019లో మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వశాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఆ విధంగా మత్స్య రంగం తొలిసారి ఒక మంత్రిత్వశాఖ పరిధిలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ''మన జాతీయ పతాకంలోని నీలి చక్రం 'నీలి విప్లవం' అంటే సముద్ర ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది'' అని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత మత్స్య జల సాగు రంగం (ఆక్వా కల్చర్/ఫిషరీస్ సెక్టార్) గడచిన దశాబ్ద కాలంలో మన ఆర్థిక వ్యవస్థలో ఒక వాస్తవిక ఉషోదయ రంగంగా ఆవిర్భవించింది. అంతర్జాతీయంగా చేపల ఉత్పత్తిలో సుమారు 8 శాతం వాటాతో మన దేశం నేడు రెండో స్థానంలో ఉంది. ఇంచుమించు 3 కోట్ల మంది జాలర్లు, చేపల పెంపకందారుల జీవనోపాధికి ఇప్పుడిది ఒక పెద్ద ఆసరాగా ఉంది. అంతేకాకుండా దేశంలో ఆహార భద్రతకూ ఈ రంగం గణనీయంగా దోహదం చేస్తోంది. 2024-25లో మన చేపల ఉత్పత్తి సామర్థ్యం 195 లక్షల టన్నుల స్థాయిని మించిపోయింది. ఈ భారీ ఉత్పత్తి మత్స్య రంగం అద్భుత పురోగమనాన్ని స్పష్టం చేస్తోంది.

మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇటీవల ఒడిషాలో, లక్షదీవులలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు నేను హాజరయ్యాను. వీటిలో మొదటిది- సముద్రపు లోతుల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగాన్ని ప్రోత్సహించేందుకు, భారత పతాకం గల నౌకలకు అధికార పత్రాల ప్రదానానికి ఉద్దేశించిన జాతీయ కార్యక్రమం. రెండోది - మత్స్య రంగంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమం. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాలను నిర్వహించడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. సముద్ర మత్స్య పరిశ్రమలో వృద్ధి, సుస్థిరత, సౌభాగ్య సహిత నవశకం వైపు పయనించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు, మన మత్స్యకార సంఘాల సమష్టి సంకల్పాన్ని ఆ కార్యక్రమాలు ప్రతిబింబించాయి. బాధ్యతాయుత చేపల వేట పద్ధతులు మన దేశ భవిష్యత్తుకు కచ్చితంగా విలువైన మూలధనమేనని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను. నేను ఉపరాష్ట్రపతిగా గత నెలలో లక్ష దీవులలో తొలిసారి పర్యటించాను. ఆ సందర్భంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద అక్కడ అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని తెలిసి చాలా ఆనందించాను.

గత ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ కూడా మన 'ఈఈజడ్' పరిధిలోని జలాల్లో నిబిడీకృత సామర్థ్యం సద్వినియోగం కాకపోవడాన్ని గుర్తించింది. దీని పరిధితోపాటు అంతర్జాతీయ జలాల్లోని మత్స్య సంపద సుస్థిర వినియోగం దిశగా ఒక ప్రగతిశీల విధాన చట్రాన్ని ప్రకటించింది. ఈ కొత్త సరిహద్దుల్లో మన మత్స్యకారులు ధైర్యంగా వేటాడేందుకు ఈ కొత్త విధాన చట్రం తోడ్పడుతుంది.

మన మత్స్యకారులకు ఈ కొత్త చట్రం ఎనలేని ప్రాధాన్యమివ్వడం నాకెంతో ఆనందదాయకంగా ఉంది. 'ఈఈజడ్'లో మత్స్య రంగంపై రూపొందించిన నిబంధనలు, అంతర్జాతీయ జలాల్లో వేటకు సంబంధించిన 2025 నాటి మార్గదర్శకాలు మన మాతృభూమి భారత్‌కు ఓ శుభారంభాన్ని సూచిస్తున్నాయి. ఈ మేరకు మత్స్యకారుల సహకార సంఘాలు, చేపల పెంపకందారులు, ఉత్పత్తిదారు సంస్థలు, భారతీయ మత్స్యకారులకు అధికార పత్రాల జారీలో దీనికింద ప్రాధాన్యం ఉంటుంది. అలాగే, సుమారు 32 చదరపు కిలోమీటర్ల భూభాగం గల లక్షద్వీప్‌కు దాదాపు 145 కిలోమీటర్ల తీరరేఖ, సుమారు 4,200 చదరపు కిలోమీటర్ల మడుగు ప్రాంతం ఉన్నాయి. అంతేగాక 20,000 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తరిత ప్రాదేశిక జలాలు, సుమారు 4 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలం కూడా ఉన్నాయి. అంటే భారత 'ఈఈజడ్'లో దాదాపు ఆరో వంతు లక్షదీవులలోనే ఉంది. ఇదే మన నిజమైన సాగర సామర్థ్యం. ఇప్పుడు ఇదొక శక్తిమంతమైన సందేశాన్నిస్తోంది: వ్యష్టిగా పనిచేస్తే వ్యక్తి ముందడుగు వేస్తాడు, అయితే అందరూ ఒక్కటై సమష్టిగా కృషి చేస్తే ఒక పరిణామాత్మక మార్పును తేగలరు.

భారత సముద్ర ఆహారం నేడు 120కి పైగా దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరంలోనే మత్స్యరంగం ఎగుమతులు రూ.73,000 కోట్ల మేర అద్భుత స్థాయికి చేరాయి. దీన్ని 2013-14 నాటి గణాంకాలతో పోలిస్తే 140 శాతానికి పైగా పెరుగుదలను సూచిస్తుంది.

ప్రపంచ అగ్రగామి మార్కెట్లలో భారత సముద్రపు ఆహారానికి మరింత ఆదరణను సముపార్జించడంలో డిజిటల్ ప్రామాణీకరణ వ్యవస్థలు, నౌకల పర్యవేక్షణ, అంతర్జాతీయ ధ్రువీకరణ, ఇతర చర్యలు ఎంతగానో తోడ్పడతాయి. ప్రగతి పథంలో పయనించేటప్పుడు మనం ప్రకృతి పట్ల మన బాధ్యతను ఎన్నడూ మరువరాదు. సముద్రం వేల ఏళ్లుగా మానవాళిని పోషిస్తోంది. దాన్ని మరిన్ని వేల ఏళ్లపాటు పరిరక్షించడం మన పవిత్ర కర్తవ్యం. కాబట్టి, సుస్థిర చేపల వేట మనకొక నైతిక బాధ్యత. ఈ దిశగా మంత్రిత్వశాఖ జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు ఒక ముందంజ. పరిరక్షణ చర్యల అమలు, చట్టవిరుద్ధ, నియంత్రణ రహిత చేపల వేటపై కఠిన వైఖరి అవశ్యమని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. లోతైన జలాలు, అంతర్జాతీయ జలాల్లోని మత్స్య సంపద మనకు చేపల వేటలోనే కాకుండా ప్రాసెసింగ్, శీతల గిడ్డంగులు, రవాణా, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, ఎగుమతి సేవలలోనూ ఉపాధిని సృష్టించగలదు. తద్వారా మన యువతకు అపార అవకాశాలు అందివస్తాయి. ముఖ్యంగా ప్రాసెసింగ్, విలువ జోడింపులో మహిళలకు అధిక భాగస్వామ్యం లభిస్తుంది. దీంతో భారత తీరప్రాంతాల ఆర్థిక జీవనం మరింత బలోపేతం అవుతుంది.

2047 నాటికి వికసిత భారత్ సంకల్ప సాకారం దిశగా దేశం పయనిస్తున్న నేపథ్యంలో నీలి ఆర్థిక వ్యవస్థను సుసంపన్నమైనదిగా, సార్వజనీనమైనదిగా, సుస్థిరమైనదిగా తీర్చిదిద్దడానికి మనం కట్టుబడి ఉన్నాం. ఈ నీలి విప్లవ పథంలో ప్రతి రంగానికి తనదైన పాత్ర ఉంటుంది. ఆ మేరకు మత్స్యకార సంఘాలు జాతీయ నీలి ఆర్థిక వ్యవస్థకు సారథ్యం వహిస్తాయి. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో మత్స్య మంత్రిత్వశాఖ ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయం. నీలి విప్లవం ద్వారా వృద్ధి, సుస్థిరత, సౌభాగ్య సహిత నవశకం వైపు అది గణనీయ ప్రగతి సాధిస్తోంది. చేపల వేటను వారసత్వ వృత్తిగా మాత్రమేగాక విజ్ఞానం, సాంకేతికత, ఆవిష్కరణలు సహా అంతర్జాతీయ అవకాశాల వైపు నడిపించే ఒక ఆధునిక వృత్తిగా పరిగణించాలని ఈ సందర్భంగా యువతకు సూచిస్తున్నాను. అలాగే, మన మత్స్యకార సమాజానికి జ్ఞానం, సాంకేతికత, ఆర్థిక సహాయం ద్వారా చేయూతను కొనసాగించాలని నేను మన సంస్థలను కోరుతున్నాను. ఆత్మవిశ్వాసంతో ముందడుగువేస్తూ సమష్టిగా మరింత శక్తిమంతమైన తీరప్రాంత మాతృభారతాన్ని ఆవిష్కరిద్దాం. సదా మాతృభూమి సేవలో...!

# ఏఐపై నియంత్రణ అత్యావసరం

**జనజీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే నాయకులు- వర్తమాన ప్రపంచ పరిణామాలను గమనిస్తూ, రాబోయే రోజుల్లో మానవాళికి ఎదురయ్యే సవాళ్లను గుర్తించగలగాలి. ఆయా రంగాల నిపుణులతో చర్చించి వాటి లోతుపాతులను అర్థంచేసుకోవాలి. ముప్పు మన ముంగిట్లోకి వచ్చేసేదాకా కాలహరణం చేయకుండా ప్రజాప్రయోజనాలను కాపాడటానికి ముందు నుంచే తగిన విధంగా సంసిద్ధం కావాలి. సంకుచిత ప్రయోజనాలు, తాత్కాలిక ఆర్థిక లాభాలకోసం వెంపర్లాడకుండా ప్రజానీకానికి దీర్ఘకాలంలో శ్రేయోదాయకమయ్యే విధానాలనే అనుసరించాలి. అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్‌లో ఇంతటి రాజనీతిజ్ఞత ఉందా అంటే, ఏమో అనుమానమే! నానాటికీ పెరిగిపోతున్న భూఉష్ణోగ్రతలు అనేక విపరిణామాలకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నప్పటికీ ట్రంప్ ఆలకించట్లేదు. పర్యావరణ మార్పులనేవి బూటకమంటూ కొట్టిపారేసిన ఆయన పారిస్ వాతావరణ ఒప్పందంలోంచి అమెరికాను వెనక్కి లాక్కొచ్చేవరకు నిద్రపోలేదు. ప్రస్తుతం ఏఐ విషయంలోనూ ట్రంప్ తనకు అలవాటైన మొండి వాదనలే చేస్తున్నారు. కృత్రిమమేధతో పొంచి ఉన్న ప్రమాదాలను భూతాపం వంటి ప్రధాన సమస్యల మాదిరిగానే పరిగణించి ప్రపంచం ప్రతిస్పందించాలని ఏఐ కంపెనీల బాధ్యులే ఒకపక్కన చెవినిల్లు కట్టుకుని పోరుతున్నారు. అలాంటి హెచ్చరికలను తేలిగ్గా తీసిపారేస్తూ, సాంకేతికతను నియంత్రించడం దుర్మార్గమని తీర్మానిస్తున్న ట్రంప్ పోకడలు భస్మాసుర వృత్తాంతాన్ని జ్ఞప్తికి తెస్తున్నాయి!**




అనూహ్య రీతిలో సామర్థ్యాలను పెంచుకుంటున్న కృత్రిమమేధకు ఇప్పుడు కళ్లెం వేయకపోతే భవిష్యత్తులో పరిస్థితులు పూర్తిగా మన చేజారిపోతాయని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమెడాయ్ హెచ్చరిస్తున్నారు. చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్, ఎలాన్ మస్క్ వంటివారు సైతం అదే విధంగా హితవు పలుకుతున్నారు. ఇలాంటి అభిప్రాయాలను ప్రతికూల శక్తుల దుష్ప్రచారంగా అభివర్ణిస్తున్న ట్రంప్ 'ఏఐలో ఎవరు గెలిస్తే వారే అంతిమ విజేతలు' అని బల్లగుద్ది చెబుతున్నారు. ఏఐను భౌగోళిక రాజకీయ పరపతిని పెంచే సాధనంగా, వ్యూహాత్మక ఆధిపత్యాన్ని అందించే ఆయుధంగా భావిస్తున్న ఆయన వీలైనంత తక్కువ నియంత్రణలతో కొత్త మోడళ్లను వేగంగా నిర్మించి ఆ అత్యాధునిక సాంకేతికతలో చైనాకు మించి పట్టుసాధించాలని తలపోస్తున్నారు. ట్రంప్ ఆశిస్తున్న విజయానికి ప్రతిగా ఆర్థిక, సామాజిక, సైనిక, సైబర్ భద్రతా రంగాల్లో ప్రపంచం ఎంతటి మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందన్నదే నేడు అందరినీ కలవరపరుస్తోంది!

నిత్యం తనను తాను మెరుగుపరచుకుంటున్న ఏఐ స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలను సృష్టించి, ఇంటర్‌నెట్ మొత్తాన్నీ స్వాధీనం చేసుకోగలిగిన స్థాయికి అతిత్వరలోనే ఎదగబోతోందని నిపుణులు పేర్కొంటున్నారు. తగిన భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేసుకోకపోతే సైబర్ దాడులు పెచ్చుమీరతాయని, సున్నిత సమాచారానికి రక్షణ ఉండదని వారు స్పష్టంచేస్తున్నారు. మోసపూరిత విధానాలను అనుసరించైనా సరే, లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్న కొన్ని ఏఐ మోడళ్ల విపరీత ప్రవర్తన గురించి ఇప్పటికే కథనాలు వెలువడుతున్నాయి. నిబంధనలు, నైతికతతో నిమిత్తం లేకుండా వ్యవహరించే కృత్రిమమేధ నమూనాల నిర్మాణాన్ని నియంత్రించాల్సిన అవసరాన్ని అవి గుర్తుచేస్తున్నాయి. ఇండియా పిలుపిస్తున్నట్లుగా బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి ప్రపంచ దేశాలు కట్టుబడాల్సిన కీలక తరుణమిది. ముఖ్యంగా అమెరికా, చైనాలే ఇందుకు బాధ్యత తీసుకోవాలి. ఉమ్మడి నియంత్రణలతో కృత్రిమమేధను సురక్షితం చేయాలి. సమ్మిళిత ప్రగతికి దాన్ని సద్వినియోగపరచాలి!

# 'నూరుశాతం' తప్పుడు చర్య

**తీసుకునే నిర్ణయాలన్నీ వికటిస్తున్న వైనం కనబడుతూనే ఉన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడలేదు. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధాన్ని నిలువరించే పేరిట ఆ దేశంపై మరిన్ని ఆంక్షలు విధించటానికీ... దాన్నుంచి ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్న భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించటానికీ అనుమతించే బిల్లును ఆయన ప్రభుత్వం ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకుంది. గత నెల ఇదే బిల్లుకు సెనేట్ ఓకే చెప్పింది. తాజా ఆమోదంతో ఈ ఆంక్షల బిల్లుకు అమెరికన్ కాంగ్రెస్ అంగీకారం తెలిపినట్టయింది. దీనిపై ట్రంప్ సంతకం చేశాక చట్టంగా మారుతుంది. ఆ అధికారాన్ని ట్రంప్ వినియోగిస్తారా లేదా అన్నది చూడాల్సివుంది.**

**రెండోసారి అధికారంలోకొచ్చాక రష్యాపై ట్రంప్ విధించ దల్చుకున్న ఈ ఆంక్షలు అత్యంత కీలకమైనవి. ఈసారి ఆంక్షలన్నీ రష్యా ఇంధన, రక్షణ రంగాలే లక్ష్యంగా రూపొందించారు.**

తన అభీష్టానికి విరుద్ధంగా ఇరుగు పొరుగు దేశాలు నిర్ణయాలు తీసుకుంటే వాటితో ద్వైపాక్షిక వాణిజ్యంతోసహా వివిధ బంధాలన్నిటినీ తెంచుకోవటం ఏ ప్రభుత్వమైనా చేసే పని. కానీ 'తన చావు జగత్ప్రళయమ'న్న రీతిలో ఆ పనే అందరూ చేసితీరాలనే డిమాండ్ మూర్ఖత్వం. అంతర్జాతీయంగా 80 ఏళ్ల క్రితం కుదిరిన ఒడంబడిక ప్రకారం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడే దేశంపై ఎలాంటి చర్యలు అవసరమో ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి నిర్ణయిస్తాయి. రష్యా తప్పు చేస్తున్నదని అమెరికా భావిస్తే ఆ వేదికలద్వారా ఒత్తిళ్లు తీసుకురావాలి. అలా చేయలేననుకుంటే తనవరకూ ఇష్టానుసారం చేసుకోవచ్చు. అసలు ట్రంప్ అత్యుత్సాహంతో అమలు చేస్తున్న సుంకాల విధానంపై అమెరికాలోనే ఏకాభిప్రాయం లేదు. రష్యాపై కఠిన చర్యల్ని సమర్థిస్తున్న డెమొక్రాట్లు సైతం ట్రంప్‌కు అతిగా అధికారాలు కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఏకపక్ష అధికారాలు అప్పగిస్తే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు.

మన దేశం గతంకన్నా దృఢంగా వ్యవహరించటం హర్షించదగ్గది. ప్రస్తుత విధానాన్ని విడనాడబోమనీ, మార్కెట్ చలనాలను నిర్దేశించే ధరవరలు, సరఫరా, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేయడం కొనసాగిస్తామనీ స్పష్టంచేసింది. వంద శాతం సుంకాలపై అమెరికా చర్యకు దిగితే ద్వైపాక్షిక సంబంధాలపై వాటి ప్రభావం పడుతుందని ఇప్పటికే అమెరికాకు తెలియ జేశామని తెలిపింది. అసలు ఈ తీర్మానం చేసే నైతిక హక్కు అమెరికన్ కాంగ్రెస్‌కు ఉందా? ఈ ఆంక్షలు ఒక్కరోజు ఆలస్యమైనా ఉక్రెయిన్‌లో మరింత మంది ప్రజలు మృత్యువుకు బలి అవుతారని తీర్మానం చెప్పడం వంచన. ఈ సూత్రం తనకు వర్తించదా? ఇరాన్‌పై ఇజ్రాయెల్ సాగించిన దురాగతాలను నిలువరించకపోగా, తానూ అందులో పాలుపంచుకుని దేశాధినేతతోసహా అనేకమంది పౌర, సైనిక ముఖ్యుల్ని హతమార్చటం... ఇప్పటికీ పౌర ప్రాంతాలపై బాంబులేస్తూ పదులకొద్దీ మందిని నిత్యం హతమార్చటాన్ని కాంగ్రెస్ ఎలా చూస్తుంది? తీర్మానం చేసేముందు తమ పాలకుడి నిర్వాక మేమిటన్న స్పృహ ఉండొద్దా? తాము అధర్మయుద్ధం కొనసాగిస్తూ ధర్మపన్నాలు వల్లించటం, వేరొకరిని వేలెత్తిచూపటం, అందరూ తననే అనుసరించాలనటం ఏం సబబు?

వచ్చేవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా సందర్శనకు రాబోతున్నారు. ఇరు దేశాలమధ్యా శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. ఇలాంటి సమయంలో ఆంక్షల తీర్మానం తీసుకురావటం, బెదిరింపులకు దిగటం తెలివిమాలిన చర్యగా అమెరికా గుర్తించకపోవటం ఆశ్చర్యకరం. ఇప్పటికే ఏఐ విషయంలో సమష్టిగా కదలాలన్న అమెరికా ప్రతిపాదనను చైనా తోసిపుచ్చింది. ఆ విషయంలో ఇరు దేశాలమధ్యా భిన్నాభిప్రాయాలున్నాయని బయటపడింది. ఈ నేపథ్యంలో మరో వివాదాన్ని రగల్చటం వల్ల ఒరిగేదేమిటి? తన పెత్తందారీ పోకడలతో విసిగిన ప్రపంచం ఇప్పటికే దూరం జరిగిందని అమెరికా గ్రహించటం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడటంలో తెరవెనక తాను నడిపించిన ఎత్తుగడలే కారణమని గుర్తులేదా? అంతర్జాతీయ వేదికల ప్రమేయం లేకుండా ప్రపంచ దేశాలపై ఒత్తిడి తేవటం చట్టవిరుద్ధమని అమెరికా తెలుసుకోవాలి.





## విశాఖ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త తొలగించిన చంద్రబాబు

స్వర్ణాంధ్రస్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా విశాఖలోని ఆర్కే బీచ్ తీరంలో సీఎం చంద్రబాబు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో సీఎం మాట్లాడారు. విశాఖ బీచ్‌కు దేశంలోనే మంచి పేరుందని, పర్యాటకులు ఎక్కువగా సాగరతీరానికి వచ్చేందుకు మక్కువ చూపుతారని, అటువంటి బీచ్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మీపైనే ఉందని సిబ్బందితో సీఎం అన్నారు.

**మూరీ మిక్చర్ బాగుంది..**

స్వర్ణాంధ్రస్వచ్ఛంధ్ర కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు బీచ్ పరిసరాల్లోని చిరు వ్యాపారులను పలకరించారు. ఈ సందర్భంగా మూరీ మిక్చర్, పీనట్ మసాలా తయారు చేసి విక్రయిస్తున్న అట్టాడ నాగమణితో మాట్లాడారు. ఆమె స్వయంగా తయారు చేసిన మూరీ మిక్చర్‌ను సీఎం రుచి చూసి బాగుందని కితాబిచ్చారు. అనంతరం ఆమెకు డబ్బులు ఇచ్చి, కలిసి ఫొటో దిగారు. ఈ సందర్భంగా నాగమణి తన వ్యక్తిగత పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వ్యక్తిగత కారణాలతో భర్తతో విడాకులు తీసుకున్నట్లు, ప్రస్తుతం తనకు స్థిరమైన ఆదాయం, ఆధారం లేదని తెలిపారు. ప్రభుత్వం తనను అదుకోవాలని కోరారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న సీఎం ఒంటరి మహిళగా ఆమెకు పింఛను అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి బీచ్‌లోకి రాగానే శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌తో మాట్లాడారు. బీచ్‌లో పారిశుధ్య నిర్వహణ ఎలా కొనసాగుతోంది? వినాయక నిమజ్జనాలు ఎక్కువగా జరిగే సమయంలో వ్యర్థాలు ఎంత సమయంలో, ఏ విధంగా తొలగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దీనికి గోవింద్ సమాధానమిస్తూ జీవీఎంసీ కమిషనర్ నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారని, రాత్రి ఒంటిగంట వరకు నిమజ్జనాలు జరిగినా ఉదయం ఆరు గంటలకల్లా బీచ్‌ను పూర్తిగా పరిశుభ్రం చేస్తున్నామని వివరించారు. మూడు షిఫ్టుల్లో మొత్తం 42 మంది కార్మికులు విధులు నిర్వహిస్తూ, సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎంకు తెలిపారు.



# 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తుల పరిశీలన పేరుతో పచ్చనోట్లకు కక్కుర్తి పడిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకంపై అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పెన్షన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి...వాటి పరిశీలిన గురించి ఆరా తీశారు. నూతన పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16,521 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికీ వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84 వేలకుపైగా చేనేతలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.

**అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం**

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తు దారుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు



తెలిసిందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేతలందరికీ ఆర్థిక మేలు కలుగజేయాలన్నది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం సహా పలు పథకాలను ఇటీవల ప్రారంభించారన్నారు. ఇపుడు 50 ఏళ్లు నిండిన చేనేతలకు నూతన పెన్షన్లు అందజేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నీరుగార్చేలా కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతి నేతన్నకూ పెన్షన్ అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఎటువంటి అపోహలకు నేతన్నలు గురికావొద్దని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని చేనేతలకు తెలిపారు. అర్హత ఉంటే ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్**

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తుల పరిశీలిన సమయంలో చేనేతల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందని మంత్రి సవిత మండిపడ్డారు. తాము ఇచ్చే అనుమతులతోనే పెన్షన్లు వస్తాయంటూ డీవో రమణారెడ్డి, ఏడీవో శీనా నాయక్ నేతన్నల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ఆ ఇద్దరు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను ఆదేశించారు. చేనేతల నుంచి వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. అర్హులను గుర్తించే సర్వేలో రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాల్లో పర్యటించి స్వయంగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులనూ తొలగిస్తూ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# విశాఖ త్రాగు, పారిశ్రామిక నీటి అవసరాలపై సీఎం సమగ్ర సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ, చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. విశాఖ తాగునీటి అవసరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఇరిగేషన్, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత నీటి వనరుల లభ్యత, నిల్వలు, పరిమితులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పైప్‌లైన్లు, లిఫ్ట్‌ల ద్వారా నీటిని అందించే అవకాశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

**ఏలేరు–కణితి ద్వారా తాగునీటికి భరోసా**

కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఏలేరు నుంచి ప్రస్తుతం రోజుకు 300 క్యూసెక్కుల నీరు అందుతోందని మంత్రి తెలిపారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లోనూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయగలుగుతున్నామని చెప్పారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 10.2 టీఎంసీల నీరు ఉండగా, అందులో 6.1 టీఎంసీలు డెడ్ స్టోరేజ్గా ఉందన్నారు. 2027 జూన్ వరకు విశాఖకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని ప్రణాళికాబద్ధంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏలేరు నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటిని 300 నుంచి 350 క్యూసెక్కులకు పెంచే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలేరు డెడ్ స్టోరేజీలోని నీటిని కూడా వినియోగించుకునేలా మోటార్లు, పంపులను ముందుగానే సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

**రైవాడకు ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి**

విశాఖకు మరో ప్రధాన నీటి వనరైన రైవాడ రిజర్వాయర్ సామర్థ్యం 3.6 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 0.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. రైవాడ కింద ఉన్న సుమారు 5,000 ఎకరాల సాగును సమర్థవంతంగా నిర్వహిస్తూ, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారని చెప్పారు.రైవాడకు ప్రత్యామ్నాయంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఎల్ఎంసీ 162వ కిలోమీటర్ వద్ద లేదా అనువైన ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటు చేసి రైవాడకు నీరు అందించే ప్రతిపాదనలను వారం రోజుల్లో పరిశీలించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.



**మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీరు**

విశాఖకు మరో ముఖ్యమైన నీటి వనరైన మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ సామర్థ్యం 1.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.2 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీటిని అందించే పైప్‌లైన్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయని చెప్పారు. మొత్తం 10.5 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 9 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో 1.5 కిలోమీటర్ల పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. మిగిలిన పైప్‌లైన్ పనులతో పాటు మోటార్లు, పంపుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మేఘాద్రిగెడ్డకు నీరు అందించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. రైల్వే, ఎలక్ట్రికల్ క్రాసింగ్‌ల వద్ద ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించాలి**

తాటిపూడి రిజర్వాయర్ సామర్థ్యం 3.3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 1.2 నుంచి 1.26 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు విజయనగరం సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారని చెప్పారు. తక్కువ నీటితో పంటలు సాగు చేసే విధానాలను అవలంబించాలని, సాగునీటి వినియోగాన్ని పర్యవేక్షించాలని విజయనగరం కలెక్టర్‌ను సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**పురుషోత్తపట్నం లిఫ్ట్ చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనం**

విశాఖ తాగునీటి అవసరాల్లో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి అన్నారు. స్థానిక వర్షాలపై ఆధారపడే రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరును నింపడం వల్లే ప్రస్తుతం విశాఖకు కీలకమైన నీటి సరఫరా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా అప్పట్లో పురుషోత్తపట్నం లిఫ్ట్‌ను ఏర్పాటు చేయడం చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనమన్నారు. గతంలో పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను విమర్శించిన వారు, నేడు వాటి ప్రయోజనాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించడంతో శ్రీశైలం నీటిని రాయలసీమ, నాగార్జునసాగర్ తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అదేవిధంగా పురుషోత్తపట్నం ద్వారా ఏలేరును నింపడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా విశాఖ తాగునీటికి భరోసా ఏర్పడిందన్నారు.

**పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు**

2027లో పోలవరం పూర్తయిన వెంటనే పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. పోలవరం పూర్తయి ఉంటే ఇప్పటికే ఉత్తరాంధ్రకు గోదావరి జలాల ప్రయోజనం మరింత ముందుగానే అందేదని మంత్రి అన్నారు. పోలవరం విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన జాప్యం వల్ల ఉత్తరాంధ్రకు నీటి ప్రయోజనాలు ఆలస్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

**డేటా సెంటర్లపై తప్పుడు ప్రచారం వద్దు**

రాబోయే డేటా సెంటర్లకు అవసరమైన నీటి పరిమాణంపై కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని మంత్రి అన్నారు. విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలను సమతుల్యం చేస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై దీర్ఘకాలిక దృష్టి**

భవిష్యత్తులో విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత పరిష్కారం కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందని మంత్రి తెలిపారు. గ్రావిటీ ద్వారా విశాఖకు నీటిని అందించే అవకాశాలను కూడా పరిశీలిస్తూ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

**సెప్టెంబర్ 23న మరోసారి సమీక్ష**

సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో ఈ ఏడాది అత్యవసర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విశాఖకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 23న విశాఖ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్, పురపాలక శాఖ అధికారులతో మరోసారి సమావేశమై విశాఖకు శాశ్వత తాగునీటి పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. విశాఖ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

## ఏపీకి భారీ వర్ష సూచన పిడుగులతో కూడిన వర్షం పడే చాన్స్

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**

**అప్రమత్తంగా ఉండాలి: వాతావరణ శాఖ**

**అమరావతి, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో రాగల రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ వంటి పలు కోస్తా జిల్లాల్లో వానలు కురుస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వాతావరణ మార్పులే అని అధికారులు తెలిపారు.

మరికొద్ది గంటల్లో ఉత్తర అండమాన్ సముద్రంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ అల్పపీడనం క్రమక్రమంగా బలపడి పశ్చిమ వాయువ్య దిశగా పయనించనుంది. ఈనెల 23 లేదా 24వ తేదీ నాటికి ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా లేదా తుఫానుగా రూపాంతరం చెందే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఈ తుఫాను ఉత్తర కోస్తా - దక్షిణ ఒడిస్సా మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు మరింత పుంజుకోనున్నాయి. కోస్తా తీర ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రైతులు కూడా తమ వ్యవసాయ పనుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల తీవ్రతను బట్టి యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది.

## ఆర్థిక సాయం అందజేసిన పరిటాల శ్రీరామ్

**- ధైర్యంగా ఉండండి... అండగా ఉంటాం.**

**- టిడిపి నాయకుల భరోసా...!**

**ధర్మవరం సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలో శుక్రవారం వినాయక నిమజ్జనం సందర్భంగా,కదిరి గేటు వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన చిన్నారి వర్షిత పార్థివ దేహాన్ని తెదేపా నాయకులు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.పండుగ రోజున పేద కుటుంబంలో విషాదం చోటు చేసుకోవడం బాధాకరమని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని తెదేపా నాయకులు ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అందజేసిన 30 వేల రూపాయలను వర్షిత తండ్రి అశోక్ కు తెదేపా నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పణి కుమార్, పరిశే సుధాకర్, పురుషోత్తం గౌడ్, నాగూరు హుస్సేన్, రామకృష్ణ, ధనుంజయ నాయుడు, చింత పులుసు పెద్దన్న, జింకా పురుషోత్తం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**- బయోగ్యాస్, సీ అండ్ డీ ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలి.**

**- సీ అండ్ డీ వ్యర్థాలతో తయారైన ఉత్పత్తులను జీవీఎంసీ పనుల్లో ఉపయోగించాలి.**

**- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ.**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 19:అనంత జనశక్తి న్యూస్**

నగరంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, వాటిని ఉపయోగకరమైన వనరులుగా మార్చేందుకు కాపులుప్పాడలో ఏర్పాటు చేసిన ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు.శనివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని బయోగ్యాస్ ప్లాంట్, నిర్మాణ-కూల్చివేత (సీ అండ్ డీ) వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ప్లాంట్ల సామర్థ్యం, వ్యర్థాల సేకరణ, శుద్ధి ప్రక్రియ, ఉత్పత్తి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి బయోగ్యాస్ ప్లాంట్‌కు తరలించే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. హోటళ్లు, మార్కెట్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల నుంచి తడి వ్యర్థాలు నిరంతరాయంగా ప్లాంట్‌కు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాల నుంచి బయోగ్యాస్, విద్యుత్, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని సమర్థవంతంగా చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.అదేవిధంగా నగరంలో ఉత్పత్తయ్యే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వాటిని సీ అండ్ డీ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయంగా శుద్ధి చేసే విధంగా సమగ్ర వ్యవస్థను అమలు చేయాలన్నారు. ప్లాంట్ల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి, నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు సూచించారు.అనంతరం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి కలసి సీ అండ్ డీ వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్ ప్రస్తుతం వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావును అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ప్లాంట్‌ను నిర్వహించలేని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టి, జీవీఎంసీ ఆధీనంలోకి తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) రూపొందించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.సీ అండ్ డీ వ్యర్థాల ద్వారా తయారైన పేవర్ బ్లాకులు, బిల్డింగ్ బ్లాకులు, ఇటుకలు తదితర ఉత్పత్తులను జీవీఎంసీ చేపట్టే ఇంజనీరింగ్, అభివృద్ధి పనుల్లో వినియోగించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజును ఆదేశించారు. తద్వారా నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగంతో పాటు సహజ వనరుల వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, డీసీపీ రామ్మోహన్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు ,అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఎల్. రాజా రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.





## ఇబ్రహీంపట్నం ఎస్సీ డిపార్ట్‌మెంట్ అబ్జర్వర్లుగా గజ్జల రాంచందర్, నందిగామ నర్సింహ

రంగారెడ్డి సెప్టెంబర్ 19 అనంత జనశక్తి న్యూస్

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్ మెంట్ అబ్జర్వర్లుగా నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్ మెంట్ వైస్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ గజ్జల రాంచందర్, నందిగామ నర్సింహను నియమించారు. ఈ సందర్భంగా గజ్జల రాంచందర్, నందిగామ నర్సింహ శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని దళితుల సమస్యలు, ఎస్సీ వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు.

ఈ సందర్భంగా గజ్జల రాంచందర్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. నియోజకవర్గంలోని దళితుల సమస్యల పరిష్కారం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. దళితుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎస్సీ డిపార్ట్ మెంట్ అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్ మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్‌కు గజ్జల రాంచందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్‌లో అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

**– హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్ 19:అనంత జనశక్తి న్యూస్

పశువుల దొంగతనాలు, మొబైల్ షాపుల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ సిటీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నిందితుల నుంచి 15 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, రూ.22 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముఠాలో తబ్రేజ్ ఏ1 నిందితుడిగా ఉన్నాడని, పశువుల దొంగతనాల్లో తబ్రేజ్, రఫిక్ ప్రధాన పాత్ర పోషించారని వెల్లడించారు.

పండుగల సమయంలో పశువుల చోరీలు

రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో నిందితులు పశువుల దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో ఎక్కువగా పశువులను చోరీ చేసేవారని సీపీ తెలిపారు. పశువులను సులభంగా తరలించేందుకు Xylazine అనే మత్తు ఇంజక్షన్‌ను ఉపయోగించి, వాటిని వాహనాల్లో ఎక్కించుకుని తరలించేవారని చెప్పారు. సాయి రెడ్డి అనే వ్యక్తి ఈ ఇంజక్షన్లను సరఫరా చేసేవాడని వెల్లడించారు.

పశువుల నుంచి మొబైల్ చోరీలకు..

రంజాన్, బక్రీద్ పండుగలు ముగిసిన తర్వాత నిందితులు మొబైల్ ఫోన్ల చోరీలకు పాల్పడటం ప్రారంభించారని పోలీసులు తెలిపారు. తబ్రేజ్, రఫిక్, ఫరహాన్ విజయవాడలోని బిగ్ సీ మొబైల్ షాపులో చోరీకి ప్రయత్నించగా అది విఫలమైంది. అనంతరం జూన్ 11న ఈ ముగ్గురు ఖమ్మంలోని సోనోవిజన్ మొబైల్ షాపులో చోరీకి పాల్పడ్డారని సీపీ తెలిపారు.

చోరీ చేసిన మొబైల్ ఫోన్లను మధ్యవర్తుల ద్వారా జావిద్ ఖాన్‌కు సుమారు రూ.20 లక్షలకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన తర్వాత ఖమ్మం పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నిందితులు హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్లి అక్కడ కూడా మొబైల్ ఫోన్ల చోరీలకు పాల్పడ్డారని సీపీ వెల్లడించారు.

చోరీ చేసిన ఫోన్లు బంగ్లాదేశ్‌కు

చోరీ చేసిన మొబైల్ ఫోన్లను విక్రయించడంలో కొందరు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఖాసీం అనే వ్యక్తి చోరీ చేసిన ఫోన్లను ముంబై, కోల్‌కతా మీదుగా బంగ్లాదేశ్‌కు తరలించేవాడని సీపీ తెలిపారు. అక్కడ వాటిని అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేవారని చెప్పారు. ఈ వ్యవహారంలో హవాలా మార్గాల్లో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని వెల్లడించారు.

మొబైల్ ఫోన్లను విదేశాలకు తరలించడం ద్వారా వాటి IMEI నంబర్లను ట్రాక్ చేయడం కష్టతరమయ్యేలా చేసేవారని పోలీసులు తెలిపారు. ఆగస్టు 17న హైదరాబాద్‌లో మరో నేరానికి నిందితులు పథకం సిద్ధం చేస్తుండగా, నేరం జరగకముందే టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## రేవంత్-కేటీఆర్ మైత్రి ఏంటో ప్రజలకు తెలుసు

**- కేంద్ర మంత్రి బండి సంజయ్**
**- కేటీఆర్ బాధపడకుండా ఉండేలా..**
**- సర్వే నంబర్లతో సహా చెప్పారని విమర్శలు**
**- డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్ 19:అనంత జనశక్తి న్యూస్

సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి, కేటీఆర్ మధ్య మైత్రి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. సర్వే నంబర్లతో సహా చెప్పి కేటీఆర్ బాధపడకుండా ఉండేలా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా పొలిటికల్ డ్రామాలు చేస్తూ ఎంపీలు, ఎమ్మెల్సీలను పంపి తమాషాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వాళ్లు వెళ్లేది ఎందుకు హద్దులు కొలవడానికా అని ప్రశ్నించారు. ఏఐసీసీకి ముడుపులు ముట్టక సమస్య సైడ్ ట్రాక్ అవుతోందని అన్నారు. ముందు కేసీఆర్ కుటుంబంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

**కేటీఆర్ సుద్దపూస మాటలు ఆపాలని కేంద్ర మంత్రి అన్నారు. పాత్తూర్ లాజిస్టిక్ పార్క్ నడుపుతోంది కేటీఆర్ అని.. కొంతమందితో కలిసి హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుతున్నారని తెలిపారు. ఖానాపూర్‌లో టికెట్ మార్చడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఒకప్పుడు ఆంధ్ర అడ్వాకేట్లు అన్న కేటీఆర్.. ఇప్పుడు వాళ్లతోనే ఎందుకు గడుపుతున్నారని నిలదీశారు. ఈరోజు రోజ్‌గార్ మేళా ద్వారా రెండు వందల మందికిపైగా ఉద్యోగ పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలలో నిరుపేద బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యం అవుతుందన్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఆ ఎన్నికలో బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.**

# జీవో 118 బాధితుల రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

**- మంత్రులతో మధుయాష్కిగౌడ్ భేటీ.. నూతన హక్కు పత్రాల జారీకి చర్యలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 19: అనంత జనశక్తి న్యూస్



ఎల్బీనగర్ నియోజకవర్గంలోని జీవో 118 బాధిత కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ మధుయాష్కి గౌడ్ కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల వేలాది మంది బాధితులకు శుభవార్త లభించిందని ఆయన పేర్కొన్నారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు మధుయాష్కి గౌడ్ శుక్రవారం అసెంబ్లీలో మంత్రిని కలిశారు. మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు పర్వతి గణేష్ రెడ్డి, జీవో 118 బాధిత కాలనీల ప్రతినిధులతో కలిసి సమస్యపై చర్చించారు.ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతోనూ సమావేశమై బాధితులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యను వివరించారు. గతంలో జారీ చేసిన జీవో 118 కారణంగా ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించి, న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత కాలనీల ప్రజలకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాలని మధుయాష్కి గౌడ్, కాలనీల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైపవర్ కమిటీ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. బాధితుల సూచనలను పరిగణనలోకి తీసుకుని రిజిస్ట్రేషన్ల సమస్యకు పరిష్కారం చూపేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కూడా మధుయాష్కి గౌడ్, బాధిత కాలనీల ప్రతినిధులు కలిసి సమస్యను వివరించారు.ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడు ఉప ఎన్నికల ప్రయోజనాల కోసం జీవో 118ను తీసుకొచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. హుడా లేఅవుట్లలో కష్టపడి కొనుగోలు చేసిన స్థలాల యజమానులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.జీవో 118తో సంబంధం లేకుండా నూతన హక్కు పత్రాలు అందించి ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 44 బాధిత కాలనీల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సభ**

జీవో 118 బాధిత కాలనీల ప్రజలతో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరై బాధితులతో మాట్లాడతారని, నూతన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# పదేళ్ల పాలనలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి: ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**- యువత త్యాగాల స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో ఉద్యోగాలపై గత పాలకులు లెక్కలు చెప్పాలి**

హైదరాబాద్, సెప్టెంబర్ 19:అనంత జనశక్తి న్యూస్




తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో యువత చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. యువత త్యాగాల స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో గత పదేళ్ల పాలనలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల కల్పనపై గత పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే నినాదాన్ని ప్రధానంగా ముందుకు తీసుకెళ్లిన నాయకులు, పదేళ్ల పాలన తర్వాత నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని వంశీకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లోనూ గత పాలనకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చిన నేపథ్యంలో, యువతకు సంబంధించిన అసలు సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని అన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించినప్పుడు ప్రతి గ్రామం, ప్రతి గల్లీలో నిరుద్యోగ యువత సమస్యలు స్పష్టంగా కనిపించాయని ఎంపీ తెలిపారు. ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న యువత తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిందన్నారు.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ గత పాలనలో ఇచ్చిన హామీలు, వాటి అమలు, ఉద్యోగాల కల్పన, నియామక ప్రక్రియలపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత గత పాలకులపై ఉందన్నారు.ఇటీవల అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలపై కూడా ఎంపీ స్పందిస్తూ.. రాజకీయ ప్రత్యర్థుల మధ్య వాగ్వాదాలు, పరస్పర విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అయితే రాజకీయ విమర్శల కంటే నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, యువత భవిష్యత్తు వంటి అంశాలపై చర్చ జరగడం ముఖ్యమని పేర్కొన్నారు.అధికారం శాశ్వతం కాదు.. ప్రజలే అంతిమ నిర్ణేతలు అని గడ్డం వంశీకృష్ణ అన్నారు. పదేళ్ల పాలన అనంతరం ప్రజలు ఇచ్చిన తీర్పును గత పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.యువత భవిష్యత్తును రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా ప్రభుత్వాల బాధ్యతగా చూడాలని ఎంపీ అన్నారు. గత పదేళ్లలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల కల్పన, నియామకాలపై పూర్తి లెక్కలను ప్రజల ముందుంచాలని గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు.పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణ ఇటీవల కూడా యువతకు ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావించారు; పార్లమెంటులో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధికి సంబంధించిన ప్రశ్నలు కూడా అడిగారు.

# తెలంగాణ యువతకు అంతర్జాతీయ అవకాశాలే లక్ష్యం: ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**- జర్మనీ, జపాన్‌లో ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు.. నైపుణ్య శిక్షణపై దృష్టి**

మంచిర్యాల సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. తెలంగాణలోని ప్రతి యువకుడికి ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వంశీకృష్ణ పేర్కొన్నారు. జర్మనీకి యువతను పంపించి ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. సంవత్సరానికి సుమారు 10 వేల అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.అదేవిధంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, ఏటీసీ కేంద్రాల ద్వారా యువతకు అవసరమైన శిక్షణ అందిస్తూ సంవత్సరానికి సుమారు 25 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ వెల్లడించారు.విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలు కొందరికే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి యువకుడికి అందుబాటులోకి రావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన అన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న కార్యక్రమాలను రాజకీయ విమర్శల పేరుతో అడ్డుకోవడం సరికాదన్నారు.కేటీఆర్‌పై విమర్శలు చేస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా రాజకీయ ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల యువతకు ఎలాంటి ప్రయోజనం ఉండదని వంశీకృష్ణ అన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిలబడి తెలంగాణ యువతకు అంతర్జాతీయ అవకాశాల కల్పనపై తమ వైఖరిని స్పష్టంగా చెబుతున్నామని పేర్కొన్నారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై కూడా ఎంపీ స్పందిస్తూ.. వాటిని పార్టీ నాయకత్వం ఖండించకుండా సమర్థించడం వారి వైఖరిని తెలియజేస్తోందని అన్నారు.ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ అవకాశాల కల్పనే తమ ప్రాధాన్యత అని గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకు అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన ద్వారానే సమాధానం ఇస్తామని ఆయన అన్నారు.

## కామేపల్లి మండలంలో రైతు కమిషన్ సభ్యుడు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి పర్యటన

కామేపల్లి సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

ఇల్లందు నియోజకవర్గం కామేపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి పర్యటించారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి శిథిలావస్థలో ఉన్న విషయాన్ని తెలుసుకుని ఆసుపత్రిని పరిశీలించారు.ఈ సందర్భంగా పశువైద్యుడితో మాట్లాడి ఆసుపత్రికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత ఏ.డీ., జేడీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. పశువైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా ఆసుపత్రి అక్కడే కొనసాగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా జనరల్ సెక్రటరీ గింజల నర్సిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవుళ్ల రామకృష్ణ, మేకల అశోక్, కామేపల్లి మండల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, కిష్టాపురం సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు.



## గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

తలకొండపల్లి సెప్టెంబర్ 19, అనంత జనశక్తి న్యూస్

గట్టు ఇప్పలపల్లి గ్రామంలో ఈతరం యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదె శ్రీనివాస్ రెడ్డి, రేన్ రెడ్డి, మిన్నాల డేవిడ్, యువజన కాంగ్రెస్ తలకొండపల్లి మండల అధ్యక్షుడు ఇంద్రకంటి శివకుమార్, మాజీ వార్డు సభ్యుడు నరేందర్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, అంజయ్య, రాజశేఖర్, శీను, మల్లేష్, కిషన్, మచ్చేందర్ పాల్గొన్నారు.ఈతరం యువసేన కమిటీ సభ్యులు చెన్నయ్య, వరుణ్, రాజ్ గౌడ్, రాహుల్, సురేష్, నాగరాజ్, నవీన్ గౌడ్, వినయ్, వెంకటేష్, శ్రీకాంత్, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.





# పెళ్ళయ్యాక కపుల్స్ తల్లిదండ్రుల్ని విడిచి వేరు కాపురం ఎందుకు పెడుతున్నారు

పెళ్ళి తర్వాత నువ్వు మారిపోయావు. ఇది భార్య భర్తని మాత్రమే అంటుందనుకుంటే పొరపాటే. కొడుకుని, కూతుళ్ళని అనే పేరెంట్స్ కూడా ఉన్నారు. అంతేనా, పెళ్ళి తర్వాత మా వాడు చాలా మారిపోయాడు. ఎంతసేపు వచ్చిన అమ్మాయి చుట్టూ తిరుగుతాడు. మమ్మల్ని పట్టించుకోడు. ఏ గాలి తాకిందో ఏంటో నసుగుతారు కొంతమంది పేరెంట్స్. కానీ, దీనికి కేవలం పిల్లలు మాత్రమే కాదు, పేరెంట్స్ కూడా కారణమవ్వొచ్చు. పెళ్ళి కాకముందు ఉండే ప్రేమ పెళ్ళి తర్వాత చాలా వరకూ చూపించరు. చూపించినప్పటికీ కొత్తగా వచ్చిన వ్యక్తి కోసం తమ కొడుకు, కూతురు ఎక్కువగా ఆలోచించడం, ప్రిఫరెన్స్ ఇవ్వడాన్ని కొంతమంది పేరెంట్స్ తట్టుకోలేరు. దీంతో చీటికి మాటికి గొడవలు. వీటన్నింటితో విసిగిపోయిన వారు దూరంగా ఉన్నా.. బంధం మొత్తానికే పోకుండా మంచిదని వేరే కాపురం పెడుతున్నారు. అసలు దానికి దారి తీసే మరికొన్ని కారణాలు ఏంటో తెలుసుకోండి.



**కోడలితో గొడవ పడడం**

ఒకే ఇంట్లో ఉన్నప్పుడు కొత్తగా వచ్చిన మనిషి అప్పటికే పర్ఫెక్ట్‌గా ఉండాలని అత్తింటివారు అనుకుంటే అది పొరబాటే. అలానే చేస్తూ కోడలితో ఇదేనా పనిచేయడం, ఇలానే చేస్తారా అంటూ మాటలనడమే కాకుండా, వారి పేరెంట్స్‌ని కూడా మాటలంటారు. దీంతో కోడలి మనసు నొచ్చుకోవడం, అత్తింటి వారికి, కోడలికి పడకపోవడం, దీంతో కోడలిపై పెత్తనం చూపించడం వంటివి పెరుగుతాయి. దీంతో మనకి తెలియకుండానే ఓ సమస్యాత్మకమైన వాతావరణంలో ఉన్నట్లుగా ఫీల్ అయి చాలా మంది వేరు పడుతుంటారు. కొంతమంది కోడళ్లు సర్దుకుపోతారు. అత్తలు సర్దుకుపోతారు. వారి ఇళ్ళలో గొడవలు ఉండవు. వేరు కాపురం వరకూ వెళ్ళదు పరిస్థితి ఎప్పుడైతే కాంప్రమైజేషన్ లేకుండా ఉంటుందో అప్పుడే వేరు కాపురం అనే ప్రసక్తి వస్తుంది.



**కొత్త మార్పులని యాక్సెప్ట్ చేయకపోవడం**

కొత్తగా ఇంటికొచ్చిన వారైనా కొత్తగా వేరే ఇంటికి వెళ్ళిన వారైనా వారి జీవితంలో వచ్చిన మార్పులని యాక్సెప్ట్ చేయాలి. కానీ, కొంతమంది దానిని ఒప్పుకోలేరు. మనం పెరిగిన వాతావరణం, ఎదుటివారు పెరిగిన వాతావరణం వేరని గుర్తించాలి, వారి ఆచార వ్యవహారాలని గౌరవించాలి. మనదే కరెక్ట్ అని ఆలోచించకుండా ఎదుటివారి విషయాల్ని యాక్సెప్ట్ చేసినప్పుడే గొడవలు కాకుండా ఉంటాయి. ఇలాంటివి పెరిగినప్పుడే గొడలు వస్తాయి. వేరు కాపురం ఆలోచనలు వస్తాయి.

**సపోర్ట్ చేయకపోవడం**

పిల్లలకి ఎప్పుడు మా డబ్బే కావాలి. మేము అవసరం లేదు. ఇది కొంతమంది చెప్పే మాటలు. అందరూ పిల్లలు అలా ఉండకపోవచ్చు. మీరు కాస్తా మాటసాయం, మేమున్నామని ధైర్యం, కాస్తా సర్దుకుపోయే మనస్తత్వాన్ని కనబరిస్తే వారిలో రాన్రాను మార్పు వస్తుంది. దీంతో విడిపోకుండా ఉంటారు. కాబట్టి, విడిగా కాపురం పెట్టే విషయంలో పిల్లలది ఎంత తొందరపాటు ఉంటుందో పేరెంట్స్‌ది కూడా ఎంతో కొంత తప్పు ఉంటుంది. వీటిని ఇద్దరూ అర్థం చేసుకుని బ్యాలెన్స్ చేసినప్పుడే ఉమ్మడి కుటుంబాలు పెరుగుతాయి.


**పక్కవారితో పోల్చడం**

ఇది చాలా మంది చేసే తప్పు. వాళ్ళ కోడలు ఎలా ఉందో చూడు, వీళ్ళ అల్లుడు ఎలా సంపాదిస్తున్నారో చూడు అంట పక్కవారితో పోల్చడం వల్ల వారి మనసు చాలా వరకూ బాధపడుతుంది. ఎవరి టాలెంట్ వారికి ఉంటుంది. ఇలాంటి కామెంట్స్, వెక్కిరింతలు ఎత్తిపొడుపు మాటలు ఎవరినైనా బాధపెడతాయి. దీంతో ఎందుకు ఎప్పుడు మాటలు పడడం విడిగా ప్రశాంతంగా ఉందామనే ఆలోచన కొడుకు, కోడలు మనసులో కలగడానికి కారణమవుతాయి. కాబట్టి, అలా ఎప్పుడు కూడా పక్కవారితో పోల్చడం చేయొద్దు.

**ఎక్స్‌పెక్టేషన్స్**

పెళ్ళి కాగానే ప్రతీ ఒక్కర 100 శాతం పర్ఫెక్ట్ అవ్వరు. మగవారు వెంటనే అన్నీ బాధ్యతలు చక్కబెట్టడం, డబ్బు సంపాదించడం, తల్లీదండ్రుల చేతికివ్వడం, ఆడవారు ఇంటి పనులన్నీ ఒక్క చేత్తో చేసి అందరి మన్ననలు పొందడం, అందరినీ గౌరవించడం, ప్రీ పని నవ్వుతూ చేయడం ఇలాంటి ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకుంటారు పేరెంట్స్. కానీ, ఇవి జరగడానికి టైమ్ పడుతుంది. వెంటనే జరగాలనే తొందర వద్దు. ఇలాంటివి జరగకపోవడంతో సూటి పోటి మాటలు పెరగడం, గొడవలకి కారణంగా మారతాయి.

# కరెంట్ స్విచ్ బోర్డ్స్‌పై నల్లని, జిడ్డు మరకలు పేరుకుపోయాయా






దీపావళి అంటేనే సెల్రబ్రేషన్ ఆఫ్ లైట్స్. మరి ఆ లైట్స్‌ని వెలిగించాలంటే స్విచ్ ఆన్ చేయాల్సిందే. దీనికోసం స్విచ్ బోర్డ్‌పై చేతులు పెడుతుంటాం. కానీ, మనం వాటిని ఎప్పుడూ క్లీన్ చేయం. దీంతో మరకలు ఏర్పడతాయి. వీటిని చూసినప్పుడు ఇల్లంతా క్లీన్‌గా ఉన్నప్పటికీ స్విచ్ బోర్డ్ మాత్రం తెల్లని బోర్డ్‌పై నల్లని మరలకు జిడ్డు పట్టి, నల్లగా మారి చూడ్డానికే చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీనిని మనం క్లాత్‌తో క్లీన్ చేసినా త్వరగా వదలవు. గట్టిగా రుద్దుదామంటే బోర్డ్, స్విచెస్ పాడవుతాయేమోనని భయం. కాబట్టి, ఏమాత్రం ఇబ్బంది కలగకుండా స్విచ్ బోర్డ్‌పై మరకల్ని ఎలా వదిలించడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి. వీటిని ఫాలో అయితే ఎక్కువగా రాయడం, తుడవడం వంటి పనులు లేకుండానే స్విచ్ బోర్డ్‌పై మరకలు వదులుతాయి. పైగా దీనికోసం బయటి నుంచి ఎలాంటి క్లీనింగ్ ఏజెంట్స్ కొనాల్సిన అవసరం కూడా లేదు. ఇంట్లోని కొన్ని పదార్థాలతోనే స్విచ్ బోర్డ్‌ని క్లీన్ చేయొచ్చు. మరి పదార్థాలు ఏంటి వాటితో ఎలా క్లీన్ చేయాలో తెలుసుకోండి.

**టూత్‌పేస్ట్**

టూత్‌పేస్ట్ కేవలం మన దంతాలను మాత్రమే కాదు. ఇంట్లో కొన్ని వస్తువుల్ని కూడా క్లీన్ చేయడానికి చక్కగా పనిచేస్తుంది. ఎందుకంటే ఈ పేస్టులో క్లీనింగ్ ఏజెంట్ ఉంటుంది. దీనిని వాడి స్విచ్ బోర్డ్‌పై మరకల్ని, దుమ్ము, ధూళిని, పసుపు పచ్చ జిడ్డు మరకల్ని వదిలించొచ్చు. దీనికోసం కొద్దిగా టూత్‌పేస్ట్‌ని మనం వాడి పాడేసే టూత్ బ్రష్‌పై పెట్టండి. దీంతో మెల్లిగా స్విచ్ బోర్డ్‌ని స్క్రబ్ చేయండి. కార్నర్స్, మరకలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో అక్కడ కొద్దిగా రుద్దండి. ఎక్కువగా తడి ఉండొద్దు పల్గ్స్ ఉన్న చోట అసలే రుద్దొద్దు. చుట్టూ పక్కల మరకలు ఉన్న చోట మాత్రమే రాయండి. కాసేపు అలానే ఉంచండి. తర్వాత తడి గుడ్డతో మరకలపై రాసి తుడవండి. దీంతో కొన్ని నిమిషాల్లోనే మరకలు వదిలి స్విచ్ బోర్డ్స్ కొత్తవాటిలా మారతాయి. ఇది చాలా బాగా పనిచేసే టిప్ అని చెప్పొచ్చు.





**నిమ్మరసం, ఉప్పు**

నిమ్మరసం, ఉప్పు రెండింటి కలయిక గాఢమైన మరకల్ని, దుమ్ము, ధూళిని దరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. నిమ్మలోని అసిడిక్ గుణాలు జిడ్డుని తగ్గించగా, ఉప్పు మరకల్ని చక్కగా వదిలిస్తుంది. వీటికోసం ఏం చేయాలంటే ఓ నిమ్మకాయని కట్ చేయండి. దానిపై కొద్దిగా ఉప్పు చల్లండి. ఆ నిమ్మ చెక్కతో మరకలపై రుద్దండి. ఈ రెండింటి కాంబినేషన్, దుమ్ము, ధూళి, మరకల్ని ఎలాంటి గీతలు పడకుండానే దూరం చేస్తుంది. అయితే, ఈ టిప్స్ ఫాలో అయ్యే ముందుగా కచ్చితంగా పవర్ ఆఫ్ చేయడం మర్చిపోవద్దు. దీని వల్ల కరెంట్ షాక్ వంటి ప్రమాదాల నుంచి తప్పించుకున్నవారవుతారు.

**నెయిల్ పాలిష్ రిమూవర్**

కొన్ని మరకల్ని మనం ఎంత క్లీన్ చేసినా దూరం చేయాలంటే అలాంటి టఫ్ మరకల్ని దూరం చేయడానికి నెయిల్ పాలిష్ రిమూవర్‌తో దూరం చేయొచ్చు. కొద్దిగా కాటన్ బాల్ తీసుకుని దానిపై నెయిల్ పాలిష్ రిమూవర్ వేయండి. దీనిని మరకలు, జిడ్డు ఉన్న చోట రాయండి. తర్వాత ఓ సారి రుద్దండి. కాసేపటి తర్వాత మరోసారి తడిగుడ్డతో క్లీన్ చేయండి. దీంతో చాలా వరకూ మరకల వదలుతుంది. మరక వదిలితే సరే, లేదంటే మరక వదిలేవరకూ ఒకటికి రెండు సార్లు చేయండి.

**మరకల్ని క్లీన్ చేసే ముందు**

- ముందుగా ఎలక్ట్రిసిటీ సప్లైని రిమూవ్ చేయండి. ఆ తర్వాత క్లీనింగ్ స్టార్ట్ చేయండి.
- క్లీన్ చేసేటప్పుడు నేల తడిగా ఉండొద్దు. అదే విధంగా, చెప్పులు వేసుకోవాలి.
- తుడిచాక మళ్ళీ స్విచ్ బోర్డ్స్ పూర్తిగా ఆరాకే పవర్ సప్లై స్టార్ట్ చేయండి.
- ఏ టిప్ వాడే ముందైనా స్విచ్ బోర్డ్స్ పైనే స్టార్ట్ చేయండి. అంతేకానీ, ప్లగ్స్ దగ్గర చేయొచ్చు.



# పెళ్లి తర్వాత పెద్దగా మార్పేం రాలేదు.. విజయ్ సున్నితమైన వ్యక్తి



విజయ్ దేవరకొండను పెళ్లాడిన తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదని నటి రష్మిక అన్నారు. కెరీర్ పతాకస్థాయిలో ఉన్నప్పుడు వివాహం చేసుకున్నా.. తన ప్రయాణం యథావిధిగానే సాగుతోందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె పంచుకున్నారు.

"మేమిద్దరం కలిసే ఎదిగాం. తోటి నటులుగా మొదలై, బెస్ట్ ఫ్రెండ్స్‌గా మారి, ఇప్పుడు భాగస్వాములమయ్యాం. విజయ్ చాలా సున్నితమైన మనసున్న వ్యక్తి. సెట్‌లో పని పట్ల ఎంతో నిబద్ధతతో ఉండే ఆయన.. బయట చాలా ఆప్యాయంగా ఉంటాడు. పెళ్లికి ముందు.. ఆ తర్వాత జీవితంలో పెద్దగా మార్పేమీ రాలేదు. వరుస సినిమాలతో బిజీగా ఉండటం వల్ల రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతున్నా" అని రష్మిక పేర్కొన్నారు.

ఎప్పుడూ స్పాట్‌లైట్‌లో నిలబడటం అంటే.. ఎవరో తలపై తుపాకీ గురిపెట్టినట్లు అనిపిస్తుంది" అని స్టార్‌డమ్ తెచ్చే ఒత్తిడి గురించి ఆమె వివరించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. భర్త విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'రణబాలి' షూటింగ్ ఇటీవల పూర్తికాగా.. తను ప్రధాన పాత్రలో నటిస్తున్న మరో చిత్రం 'మైసా' చిత్రీకరణ చివరి దశలో ఉంది.. ఇక, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిజీవిత కథని తెరపైకి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ' పేరుతో రూపొందుతున్న ఈ బయోపిక్‌లో రష్మిక ప్రధానపాత్రలో కనిపించనున్నారు.

# ఏదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి అని అడుగుతున్నారు: రాధికా ఆప్టే

గతంలో తాను చేసిన బోల్డ్ పాత్రల వల్ల, కథలో అవసరం లేకపోయినా తనతో ముద్దు సీన్లు చేయించాలని కొందరు దర్శకనిర్మాతలు యత్నించారని బాలీవుడ్ నటి రాధికా ఆప్టే అన్నారు. తనను కేవలం లోదుస్తులతో ఓ యాక్షన్ సన్నివేశంలో నటించాలని అడిగారని ఆమె గుర్తుచేసుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రాధికా.. సన్నివేశాల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"కెరీర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో నగ్నంగా నటించాను. అది చూసి 'ఆమె సులభంగా అంగీకరిస్తుందిలే' అని కొందరు అనుకుంటున్నారు. కానీ, ఇప్పుడు నేను అలాంటివి చేయడంలేదు. మూవీలో సన్నిహిత సన్నివేశాలు ఎందుకు అవసరమో స్పష్టమైన కారణం చెప్పాలని అడుగుతున్నాను. కొందరైతే 'ఓ 15 సెకన్లు ఏదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి' అని అడుగుతున్నారు. అది వింటే నాకు నవ్వొస్తుంది" అని రాధికా పేర్కొన్నారు.

"ఒక సినిమా సెట్‌లో యాక్షన్ సన్నివేశం కోసం షర్టు గుండీలు విప్పేసి నటించగలరా? అని అడిగారు. యాక్షన్ సీన్ అంటే వేగంగా కదులుతాం కాబట్టి కుదరదని చెప్పా. పోనీ కేవలం లోదుస్తులతో అయినా చేయాలని అడిగారు. అసలు దీని ద్వారా ఏం సాధించాలనుకుంటున్నారు? అని నేను వారిని ప్రశ్నించా. ఆ సీన్ చేయడానికి అంగీకరించలేదు. నన్ను అలా అడిగిన వ్యక్తి పేరు చెబితే మీరంతా కచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఆ స్థాయి ఉన్న వ్యక్తుల నుంచి అలాంటి మాటలు ఎవరూ ఊహించరు" అని రాధిక చెప్పుకొచ్చారు. కేవలం ప్రాజెక్ట్‌ను హిట్ చేయడానికి నటీమణులను హద్దులు దాటేలా ఒత్తిడి తేవడం సరికాదని ఆమె అన్నారు. రాధికా ఆప్టే ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'లస్ట్ స్టోరీస్ 3' వెబ్ సిరీస్‌లో నటించారు. ఆమెతో పాటు ప్రముఖ నటులు సిద్ధార్థ్, అదితీరావ్ హైదరీ, కొంకణా సేన్ శర్మ, రాధికా మదన్, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు.



# రెండో బిడ్డకు జన్మనిచ్చిన దీపిక పదుకొణె



బాలీవుడ్ స్టార్, రణ్‌వీర్ సింగ్ మరోసారి తల్లిదండ్రులయ్యారు. శనివారం (సెప్టెంబర్ 19న) దీపిక రెండోసారి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. అందులో 'వెల్‌కమ్ బేబీ గర్ల్ (19-09-2026). ఇట్లు.. దువా, దీపిక, రణ్‌వీర్' అని రాసుకొచ్చారు. దీపిక, రణ్‌వీర్ దంపతులకు 2018లో ఇటలీలోని లేక్ కోమోలో ఘనంగా వివాహం జరి గింది. వీరికి తొలి సంతానంగా 2024లో 'దువా' జన్మించిన సంగతి తెలిసిందే. మరోవైపు దీపిక, రణ్‌వీర్ దంపతులకు బాలీవుడ్ నటీనటులు శుభాకాంక్షలు చెబుతున్నారు.

# మలయాళం ఇండస్ట్రీ నుంచి చాలా నేర్చుకోవచ్చు

'జడల్' పాత్రతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు నటుడు నాని. ఆయన ప్రధానపాత్రలో నటించిన సినిమా 'ది ప్యారడైజ్' . శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో నాని బిజీగా ఉన్నారు. తాజాగా 'కొచ్చి'లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ఇంకా ఈ సినిమాకు సెన్సార్ రాలేదని, 'A' సర్టిఫికెట్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని వల్ల పిల్లలు, కుటుంబ ప్రేక్షకులు థియేటర్‌లకు రాలేని మాట వాస్తవమే అయినప్పటికీ.. త్వరలోనే తన నుంచి కుటుంబ కథా చిత్రాలు వస్తాయని చెప్పారు. ఒక నటుడిగా అన్ని రకాల జానర్లను ప్రయత్నించాలని నాని అన్నారు. రెండు సినిమాల తర్వాత మళ్లీ 'భలే భలే మగాడివోయ్' లాంటి చిత్రంలో నటిస్తానని తెలిపారు.

"హిట్ 3' (Hit 3) ప్రచారం కోసం కొచ్చి వచ్చాను. ఏడాదిన్నర గడిచినా నాకు నిన్న వచ్చినట్లే ఉంది. ఇక్కడి వాళ్లు అంత ప్రేమ చూపిస్తారు. మలయాళం సినిమాలంటే నాకు ఎంత ఇష్టమో ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. ఈ ఇండస్ట్రీని చూసి చాలా నేర్చుకోవచ్చు. ముఖ్యంగా సమయాన్ని బాగా సద్వినియోగం చేసుకుంటారు. మంచి సినిమాలను అందిస్తారు. ఇది పరిశ్రమలన్నీ నేర్చుకోవాలి" అని నాని ఈ సందర్భంగా అన్నారు. ఇక ప్యారడైజ్ ట్రైలర్ విడుదల చేయకపోవడం గురించి మాట్లాడుతూ.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఉండడం వల్ల ట్రైలర్‌ను తీసుకురాలేకపోయామని చెప్పారు. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయని తెలిపారు. అవి అన్నీ ఒకేసారి థియేటర్‌లో చూడాలన్నారు.



# ఇవే నా చివరి ఆసియా గేమ్స్ కావొచ్చు: స్టార్ షట్లర్



భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడలే తనకు చివరివి కావొచ్చని తెలిపాడు. "మరో నాలుగేళ్ల తర్వాత ఇదే స్థాయిలో ఆడుతానో లేదో తెలీదు. బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు కావొచ్చు. ప్రస్తుతం శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నా. ఇటీవల వియత్నాం ఓపెన్‌లోనూ కొంతకాలం తర్వాత మంచి ప్రదర్శన చేశాను. గత ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని తృటిలో చేజార్చుకున్నాం. ఈసారి ఫైనల్‌కు చేరి బంగారు పతకం గెలుస్తామని ఆశిస్తున్నా" అని ప్రణయ్ చెప్పుకొచ్చాడు.

అయితే 2028లో లాస్‌ఏంజెలెస్‌లో జరిగే ఒలింపిక్స్ ఆశలను మాత్రం అతడు వదులుకోలేదు. "ఎల్‌ఏ 2028ఏ నా లక్ష్యం. రాబోయే ఏడాదిన్నర వరకు గట్టిగా ప్రయత్నిస్తా. ఒలింపిక్స్‌కు వెళ్లే అవకాశం ఉందని అనిపిస్తే కొనసాగుతా. లేకపోతే ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటా. కిదాంబి శ్రీకాంత్ కోర్టులో చూపిస్తున్న పట్టుదల నాకు స్ఫూర్తినిస్తోంది. అతన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నేనూ అలా ఆడగలననే నమ్మకం వస్తుంది" అని పేర్కొన్నాడు. డబుల్స్ స్టార్ ఆటగాడు చిరాగ్ శెట్టి మాట్లాడుతూ.. "నిరుడు రజతం సాధించాం. గతాన్ని పక్కనపెట్టి ఈసారి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తాం. కోర్టులో చెలరేగే పులుల్లా ఆడి.. దేశానికి బంగారు పతకం అందిస్తాం. రాబోయే పది రోజుల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నాడు.

# ఆసియా గేమ్స్.. నఖ్వీ చేతుల మీదుగా మెడల్స్ తీసుకోవాల్సిందేనా..?

ఆసియా క్రీడల్లో భారత్‌కు మళ్లీ 'నఖ్వీ' సమస్య ఎదురవుతుందా? జపాన్ వేదికగా జరుగుతోన్న ఈ టోర్నీలో భారత క్రికెట్ జట్లు పతకాలు సాధిస్తే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్, ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా వాటిని స్వీకరించాల్సిందేనా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరి దీనికి నిబంధనలు ఏం చెబుతున్నాయి..? బీసీసీఐ స్పందన ఏంటీ..?

ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా నిబంధనల ప్రకారం.. ఆసియా ఒలింపిక్ మండలి అధ్యక్షుడు విజేతలకు మెడల్స్ అందిస్తారు. కొన్ని సందర్భాల్లో ఈ పతకాలు అందించే బాధ్యతను ఓసీఏలోని ఇతర సభ్యులకు కూడా అప్పగించే అధికారం అధ్యక్షుడికి ఉంటుంది. ప్రస్తుతం ఆసియా ఒలింపిక్ మండలిలో నఖ్వీ కూడా సభ్యుడే. ఒకవేళ మెడల్స్ ఇచ్చే బాధ్యతను నఖ్వీకి అప్పగిస్తే.. భారత ఆటగాళ్లు వాటిని స్వీకరించాల్సి ఉంటుందని భారత ఒలింపిక్ సంఘం వర్గాలు తెలిపాయి. అందుకు తిరస్కరిస్తే, గేమ్స్‌ను అగౌరపరిచిన కిందకే వస్తుందని పేర్కొన్నాయి. ఇక, మెడల్స్ ప్రదానోత్సవంలో ఎలాంటి రాజకీయ, మతపరమైన ప్రచారానికి అనుమతి ఉండదు.

ఈ అంశంపై బీసీసీఐకార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. "ప్రస్తుతానికి మా దృష్టంతా మ్యాచ్‌లు గెలవడంపైనే ఉంది. పతకాలు గెలిచిన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి దానిపై నిర్ణయం తీసుకుంటాం. అంతేగానీ, ఇంకా జరగని దాని గురించి ఇప్పుడే మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. గత రెండు ఆసియా కప్‌లలో (2025లో పురుషులు, ఇటీవల మహిళల జట్టు) భారత జట్లు టైటిల్స్ సాధించినప్పుడు ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకునేందుకు బీసీసీఐ నిరాకరించిన సంగతి తెలిసిందే. ఆ ట్రోఫీలు కూడా మన దేశానికి వచ్చి చేరుతాయని సైకియా ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.




# 'లక్ష్య' అభినయ్‌కి స్వర్ణం

- సౌత్ జోన్ జూనియర్ జాతీయ అథ్లెటిక్స్

సౌత్ జోన్ జూనియర్ జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 'లక్ష్య' అథ్లెట్ల జోరు కొనసాగుతోంది. పుదుచ్చేరిలో జరుగుతున్న టోర్నీలో శుక్రవారం తెలంగాణకు చెందిన అభినయ్ నాయక్ డెకాథ్లాన్‌లో 5842 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. 110 మీటర్ల హర్డిల్స్ రేసును 14.17 సెకన్లలో పూర్తి చేసిన ఆంధ్ర కుర్రాడు తనీష్ తేజ రజతం నెగ్గాడు. షాట్‌పుట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నిత్య హాసిని (11.12 మీటర్లు) కూడా రజతం సాధించింది. షాట్‌పుట్ పురుషుల్లో సునీత్ కుమార్ (తెలంగాణ- 15.52 మీ), మహిళల్లో ఎండీ అసియా (ఏపీ, 11.91 మీ) కాంస్యాలు గెలిచారు. మెడ్లీ రిలేలో ప్రశంస (తెలంగాణ) 2:18.00 సెకన్ల టైమింగ్‌తో కంచు పతకం నెగ్గింది. 4×100 మీ. రిలేలో పుష్యమి నాగసాయి, సూరి ప్రిస్కిల్ల (ఏపీ) కాంస్యాలు సాధించారు. 1000 మీ. పరుగులో శివాని (తెలంగాణ) 3:05.99 సెకన్ల టైమింగ్‌తో కాంస్యం గెలిచింది.




# టెక్‌బాల్ సెమీస్.. ఓడిన క్విమ్సి డిసౌజా: ఇంకా భారత్‌కు ఛాన్స్

: ఆసియా క్రీడల్లో టెక్‌బాల్ మహిళల సింగిల్స్‌లో ఆది నుంచి అదరగొట్టిన క్విమ్సి డిసౌజా .. సెమీస్‌లో తడబడింది. ఇండోనేసియా క్రీడాకారిణి సుమయా చేతిలో ఓడింది. అయితే క్విమ్సికి ఇప్పటికీ పతక అవకాశాలు మిగిలే ఉన్నాయి. ఆదివారం ఆమె కాంస్యం కోసం పోటీపడనుంది.

సెమీస్‌ను అద్భుతంగా ఆరంభించిన డిసౌజా మొదటి సెట్‌ను 12-7 తేడాతో గెలుచుకుంది. అయితే రెండో సెట్‌లో సుమయా అనూహ్యంగా పుంజుకుని.. 12-9 తేడాతో సెట్ గెల్చుకుంది. ఆ తర్వాత నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఇండోనేసియా క్రీడాకారిణి 12-7 తేడాతో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. కాగా.. సెమీస్‌లో ఓడిన వారు కాంస్యం కోసం పోటీపడే వీలుంది. ఈ క్రమంలోనే మూడోస్థానం కోసం కంబోడియాకు చెందిన కోమ్యేన్ డైతో క్విమ్సి తలపడనుంది.

టేబుల్ టెన్నిస్ + ఫుట్‌బాల్‌ను కలిపి ఆడితే టెక్‌బాల్ అవుతుంది. టీటీ టేబుల్‌పైన చేతులతో కాకుండా మిగతా శరరీంతో ఫుట్‌బాల్‌లా తలపడటమే టెక్‌బాల్. 2017లో తొలిసారి టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. 2018-19లో భారత్‌లో ప్రవేశించిన ఈ ఆటకు.. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. భారత్ నుంచి ఈసారి ఆసియా క్రీడల్లో ముగ్గురు బరిలోకి దిగారు. సింగిల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ క్విమ్సి పోటీపడుతోంది. ఈ గేమ్‌లో భారత్‌కు ఆమె పతకం తీసుకువస్తే.. తొలి అథ్లెట్‌గానూ చరిత్రలో నిలిచిపోనుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945